



అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన దేవీచౌక్‌లోని బాలాత్రిపుర సుందరీదేవి.. (పక్కన) దేవీచౌక్‌లో కోలాహలం.. కేరళ సంప్రదాయ వాయిద్యాల సందడి →

మూడోరోజు అన్నపూర్ణాదేవిగా సాక్షాత్కారం

కేరళ వాయిద్యాలతో మారుమోగిన దేవీచౌక్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు బాలాత్రిపుర సుందరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేరళ సంప్రదాయ వాయిద్యాలతో దేవీచౌక్ ప్రాంగణం మారుమోగింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు పిల్లలు, పెద్దలు అమ్మవారిని దర్శించుకుని దేవీచౌక్ లైటింగ్‌ను, సెట్టింగ్‌లను తిలకించారు. అలాగే సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. కాగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అమ్మవారిని సాయంత్రం దర్శించుకున్నారు.

జిల్లాలో హోమ్‌స్టేలను ప్రోత్సహించాలి

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఊతమిచ్చేవిధంగా హోమ్ స్టేలను ప్రోత్సహించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం డీఆర్‌డీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో, గోదావరి గట్టు పరిసరాల్లో డ్వాక్రా మహిళలతో చర్చించి హోమ్ స్టేలను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఒకప్పుడు ప్రాచుర్యం పొందిన స్థానిక కళలు, జానపద సంప్రదాయాలను గుర్తించి పుష్కరాల్లో ప్రదర్శనలు, మార్కెటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తే కళాకారులకు స్థిరమైన ఆదాయం, కళలకు పునరుజ్జీవం లభిస్తుందన్నారు. డ్రాన్ దీదీ పథకం కింద వ్యవసాయ అవసరాలకు డ్రోన్లను అందజేసి డ్వాక్రా మహిళలు టెక్నాలజీ ఆధారిత వ్యవసాయ సేవలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 20 సంఘాలకు డ్రోన్లను అందించడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. ఉల్లాస్ ద్వారా 15-59 ఏళ్ల మధ్య వయసు కలిగిన నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మూర్తి, ఏపీడీ సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీఓఎస్ఎస్) ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలు పొందడానికి రూ.200 అపరాధ రుసుంతో అక్టోబరు 31 వరకూ గడుపు పొడిగించడం జరిగిందని జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. మరింత సమాచారం కోసం ఏపీఓఎస్ఎస్ వెబ్‌సైటు, ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ లేదా డీఈవో కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.



జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం నేరుగా ప్రజలకు చేరాలన్నదే కేంద్ర ప్రభుత్వ అభిమతం. కానీ ఆ ప్రయోజనం ఇప్పటిదాకా లక్ష్యాన్ని చేరలేదు. మార్కెట్‌లో వేలాది రకాల వస్తువుల ధరలపై జీఎస్టీ తగ్గింపు వర్తించింది. సోమవారం నుంచి రెండు శ్లాబుల జీఎస్టీ అమలులోకి వచ్చింది. దాంతో ఈ విధానంలో ప్రకటించిన వస్తువుల ధరలన్నీ తగ్గిపోవాలి. కానీ ఆ పరిస్థితి ఏవో కొన్ని వస్తువులు మినహా పెద్దగా ఆ ప్రభావం కనిపించలేదు. అంతెందుకు రోజూ కొనుగోలు చేసే కొన్ని కంపెనీల పాల ప్యాకెట్ ధర కూడా ఇప్పటివరకు తగ్గలేదు. ఇక వైద్యానికి సంబంధించి అత్యవసర మందులు, వస్తువులపై కొత్త జీఎస్టీలో తగ్గింపులు ఉన్నాయి. కానీ ఆ తగ్గింపేమీ కనిపించడం లేదు. పాత ఎమ్మార్పీవి అంటూ మెడికల్ షాపుల వారు దోపిడీ చేసేస్తున్నారు.

- జీఎస్టీ తగ్గింపులో మందుల్లో మతలబు
- పాత ఎంఆర్పీలంటూ దోపిడీ
- అత్యవసర మందులపైనా మోసం
- ఉమ్మడి తూర్పులో 3 వేల మెడికల్ షాపులు
- అవగాహన లేమితో రూ.కోట్లలో ప్రజలకు నష్టం
- మూమూళ్ల మత్తులో డ్రగ్స్.. పట్టించుకోని వాణిజ్యం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మందుల ఖర్చు చూసి ఇవాళ రోగం మరింత ముదిరిపోతోంది. ఓవైపు అధిక శాతం డాక్టర్లు మందులతో చీటీలను పూర్తిగా నింపేస్తుంటే.. మరోవైపు మందుల దుకాణాల వాళ్లు ఎడాపెడా దోచేస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో సొంత మెడికల్ షాపులు ఉండడంతో ఇదో అదనపు వ్యాపారంగా మారిపోయింది. బయట షాపుల్లో ఎంఆర్పీపై ఏకంగా 20 శాతం వరకూ తగ్గింపు ఇస్తామంటూ వ్యాపారస్తులు పోటీ పడుతూ ఉంటారు. ఆస్పత్రుల్లోని మెడికల్ షాపుల్లో ఆ రాయితీ వర్తించదు. పైగా మందుల ధర వాస్తవంగా ఎంతో వాటిపై ఉండదు. ఎంఆర్పీ మాత్రమే ఉంటుంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మందులపై జీఎస్టీని గణనీయంగా తగ్గించింది. అత్యవసర మందులపై పన్ను ఎత్తేసింది. కానీ ప్రజలకు మాత్రం ఆ మేరకు జేబుకు ఆదా కనబడడం లేదు. అధిక శాతం దుకాణాల్లో బిల్లులు కూడా ఇవ్వకపోవడంతో జీఎస్టీ తగ్గింపు తెలియడం లేదు.

● ఇలా దోపిడీ...

ఓ వ్యక్తి రాజమహేంద్రవరంలోని హైటెక్ బస్టాండు సమీపంలో ఓ పెద్ద మందుల షాపునకు వెళ్లి 10 ట్యాబ్లెట్ల స్ట్రిప్ కొన్నాడు. దానిపై రూ.335 ఎంఆర్పీ ధర ఉంది. తమ వద్ద ప్రత్యేక రాయితీ అంటూ రూ.284 తీసుకున్నారు. వినియోగదారుడు సంతోషించి.. బిల్లు అడిగాడు. దీంతో రూ.266కి బిల్లు ఇచ్చారు. అదేంటని ప్రశ్నిస్తే జీఎస్టీ తగ్గింపని సెలవిచ్చారు. ఒకవేళ బిల్లు తీసుకోకపోతే నష్టపోయేవాడే కదా. మరో వ్యక్తి హార్లిక్స్ కొన్నాడు. దాని ఎంఆర్పీపై 7శాతం తగ్గించారు. అది తమ షాపులో మాత్రమే ఇచ్చే తగ్గింపని చెప్పాడు. జీఎస్టీ తగ్గింపుపై ప్రశ్నించగా.. ఆ స్టాకు పాత ఎంఆర్పీతో ఉందని జీఎస్టీ తగ్గింపు రాదని సెలవిచ్చాడు. ఇది కేవలం ఆ ఇద్దరికి జరిగిన తంతు మాత్రమే కాదు. నూటికి 99శాతం మందికి మందులపై జీఎస్టీ ఆదా చేకూరడం లేదు. వందల రకాల మందులు ఉండడంతో బోర్డులు పెట్టడం సాధ్యం కాదనుకున్నా.. కనీసం బిల్లులు పక్కాగా ఇస్తూ, వాటిలో జీఎస్టీ తగ్గింపును స్పష్టంగా పేర్కొంటే వినియోగదారుడికి సొమ్ము ఆదా అవుతుంది.

● అంతా అయోమయం

చాలా మందుల షాపుల్లో బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో జీఎస్టీ తగ్గింపు వర్తింపు అయోమయంగా మారింది. బిల్లులు ఇవ్వకపోవడంపై వాణిజ్య పన్నుల శాఖ పట్టించుకున్న దాఖలాలు లేవనే చెప్పవచ్చు. దీంతో తాము కొన్న మందులకు ఇటీవల తగ్గించిన జీఎస్టీ వర్తించిందో లేదో వినియోగదారుడికి తెలియడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3 వేల వరకూ మందుల షాపులుండగా.. 150 వరకూ పెద్ద దుకాణాలు ఉన్నాయి. ఈ పెద్ద దుకాణాల్లో బిల్లులు ఇస్తున్నా జీఎస్టీ తగ్గింపు చూపించడం లేదు. అత్యవసర, క్యాన్సర్ మందులపై జీఎస్టీ గతంలో 5% నుంచి 12% వరకూ ఉండేది. దానిని పూర్తిగా తీసేశారు. జనానికి అత్యవసర మందులపై అవగాహన ఉండదు. వైద్యుడు ఇచ్చిన చీటీ ప్రకారం మందులు తెచ్చుకుంటారు. అత్యవసర మందులతోపాటు సాధారణ మందులను ఒకే చీటీలో రాస్తారు. దీంతో సందట్లో సడేమియా మాదిరిగా అత్యవసర మందులకు జీఎస్టీ తగ్గింపు ఇవ్వడం లేదు. ఉదాహరణకు అత్యవసర మందుల ధర రూ.5 వేలు అనుకొంటే గతంలో రూ.250-600 వరకూ జీఎస్టీ ఉండేది. ఇప్పుడు పూర్తిగా మినహాయించడంతో ఆ మేరకు తగ్గించాల్సి ఉంది. కానీ ఆ లాభం వినియోగదారుడికి అందడం లేదు. గ్లూకోమీటర్, టెస్ట్ స్ట్రిప్‌లు, థర్మామీటర్లు, డయాగ్నస్టిక్ రసాయనాలు/కిట్లు, ఇతర మందులపై జీఎస్టీని 18/12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. కానీ వాటిపై ఆ తగ్గింపును వర్తింపజేయడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని రాజమహేంద్రవరం, కాకినాడ మెడికల్ హబ్‌లుగా కొనసాగుతున్నాయి. దీంతో రోజుకు కోట్లాది రూపాయల మెడిసిన్ ఇతర వైద్య పరికరాలు/వస్తువుల అమ్మకాలు జరుగుతాయి. ఇప్పుడు జీఎస్టీ తగ్గింపు వినియోగదారుడికి చేరకపోవడంతో కేంద్రం ఉద్దేశం నిర్వీర్యమవుతోంది. ఇప్పటికైనా డ్రగ్స్ శాఖ మత్తు వీడితే ప్రజలకు మేలు జరుగుతుంది. వాణిజ్య పన్నుల శాఖ దృష్టి సారిస్తే బిల్లులు మేల్కొంటాయి.

● ఇదో మాయాజాలం

సొంతంగా ఆస్పత్రుల్లోనే మెడికల్ షాపులు ఉండడంతో చాలామంది ప్రిస్క్రిప్షన్ నిండిపోయే వరకూ మందులు రాసేస్తున్నారు. బయట మెడికల్ షాపుల్లో ఇచ్చే రాయితీ కూడా వీళ్లు ఇవ్వడం లేదు. అంటే మందులపై ఎంత లాభం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దీని వెనుక మరో ఆశ్చర్యపోయే మాయ దాగి ఉంది. గతంలో మందుల తయారీ కంపెనీలు రిప్రజెంటేటివ్స్‌ని నియమించుకొని వాళ్లను డాక్టరు వద్దకు పంపించి ప్రొడక్టును ప్రచారం చేసుకోవడం జరిగేది. దీనిని ఎథికల్ మార్కెటింగ్ అనేవాళ్లు. హరియాణా, గుజరాత్‌లోని పలు మూరుమూల ప్రాంతాల్లో మందుల తయారీ కంపెనీలు కోకొల్లలుగా ఉంటాయి. మెడికల్ రిప్రజెంటేటివ్‌లుగా అనుభవం వచ్చిన తర్వాత కొందరు డాక్టర్ల వద్ద ఆర్డర్లు తీసుకొని సొంతంగా ఆ ప్రాంతాలకు వెళ్లి పెద్ద మొత్తంలో మందులు కొనుగోలు చేసి తీసుకురావడం మొదలైంది. దీనిని ప్రాపగాండా కం డిస్ట్రిబ్యూషన్(పీసీడీ) అంటారు. ఇలా మొదలైన ఆ ఒరవడి డాక్టర్లు ఒక బాక్సు కొంటే పది బాక్సులు ఉచితంగా ఇచ్చే స్థాయికి వెళ్లింది. ఇది గమనించిన కొందరు డాక్టర్లు కలిపి నేరుగా రంగంలోకి దిగారు. అలా వాళ్లే సొంతంగా వెళ్లి మందులు తెచ్చుకోవడం మొదలుపెట్టారు. ఉదాహరణకు పెంటాప్రజోల్ షీటు ధర తయారీ కేంద్రం వద్ద రూ.5 ఉంటే మన చేతికి వచ్చేసరికి రూ.150 అవుతుందన్నమాట. వాస్తవానికి కంపెనీ పెట్టిన పేరుకాకుండా ప్రిస్క్రిప్షన్‌లో ఔషధం పేరు రాయాలనే నిబంధనను ఎప్పుడో చంపేశారు. యాంటిబయోటిక్స్ తక్కువగా సూచించాలని నాటితరం వైద్యులు నెత్తీనోరు బాదుకుంటున్నా తమ వ్యాపారం కోసం వైరల్ ఫీవర్‌కి సెఫిక్జిమో ఒఫలాక్సిన్ వంటి యాంటిబయోటిక్స్ చీటీల్లో నింపేస్తున్నారు.



అనపర్తిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పిచికారి చేసేందుకు డ్రోన్‌లో నింపుతున్న సేంద్రియ ఎరువుల విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కీర్తి

ప్రకృతి వ్యవసాయం ద్వారానే నాణ్యమైన ఆహారం

- రైతులను ఆ దిశగా పోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది
- అనపర్తిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

అనపర్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి ప్రసాదించిన సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా ఆహార ఉత్పత్తుల్లో నాణ్యత లభించి తద్వారా ప్రజలకు నాణ్యమైన ఆహారం అందుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. బుధవారం అనపర్తి మహాలక్ష్మీపేటలో రైతు రాజగిరి శ్రీనివాస్ చేపట్టిన సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతు శ్రీనివాస్‌తో ముచ్చటిస్తూ సేంద్రియ వ్యవసాయానికి మామూలు పద్ధతికి తేడాలు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో వినియోగిస్తున్న సేంద్రియ ఎరువులను వాటిని తయారు చేసుకునే విధానాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. గత మూడేళ్లుగా తాను కౌలుకు చేస్తున్న భూమిలో ఒకటిన్నర ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తూ పండిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఏ ఏడాదికాయేడాది ఎక్కువ భూమిలో ప్రకృతి సాగు పెంచుతూ వస్తున్నానని అన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా ఖర్చు తగ్గుతుందని, దిగుబడిలో పెద్ద మార్పు ఉండదని, ఎరువుల ఖర్చులో సగానికి సగం ఆదా అవడమే కాకుండా భూమిలో సారం పెరుగుతుందని ఆయన వివరించారు. ప్రత్యేక పద్ధతిలో రూపొందించిన పనిముట్ల ద్వారా ఊడ్పుల నుంచి కలుపుతీత వరకు వినియోగిస్తున్నామని, ప్రత్యేకంగా తయారుచేసిన జీవామృతాలను డ్రోన్ సహాయంతో పిచికారి చేయడం వల్ల శ్రమతోపాటు సమయం కూడా ఆదా అవుతున్నట్టు ఆయన వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా జరిగే మేలును మిగిలిన రైతులకు తెలిసేవిధంగా అవగాహన కల్పిస్తే ఎక్కువ మంది రైతులు ప్రకృతి సాగుకు మరలే అవకాశం ఉందన్నారు. పచ్చిరొట్ట ద్వారా భూసారం పెరుగుతుందని, తద్వారా యూరియా వాడకం కూడా తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువుల తయారీలో రైతులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. కౌలు రైతులు సేంద్రియ వ్యవసాయం వైపునకు దృష్టి సారిస్తే ఖర్చులు తగ్గడమే కాకుండా కుటుంబానికి ఆర్థికంగాను, ఆరోగ్యంగాను మేలు చేకూరుస్తుందన్నారు. భవిష్యత్‌లో సేంద్రియ వ్యవసాయంతో కూడిన ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందని ప్రజలు వ్యవసాయ క్షేత్రాల వద్దకు వచ్చి కొనుగోలు చేసే పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. అనపర్తి పరిసరాల్లో సుమారు 400 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతోందని ఇది మరింత పెరగాలని ఆమె అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్ మాధవరావు, సర్పంచ్ వారా కుమారి, ఏపీ సీఎంఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, తహశీల్దార్ అనిల్ కుమార్, రైతులు శ్రీనివాస్, చిట్టిబాబు, విశ్వనాథరెడ్డి, ఎమ్‌వీవీ రాఘవరెడ్డి, జిల్లా ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉన్నారు.

అధ్యక్షా!



బాలికా సంరక్షణ బాండ్లకు నగదు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బాలికా సంరక్షణ పథకం బాండ్లకు నగదు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు. బుధవారం అమరావతిలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆదిరెడ్డి వాసు మాట్లాడారు. బాలికల నిష్పత్తిని ప్రోత్సహించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005లో ప్రభుత్వం కుటుంబంలో ఒక ఆడపిల్ల ఉంటే రూ.లక్ష, ఇద్దరుంటే చెరో రూ.30 వేల చొప్పున రూ.60 వేల జీవిత బీమా సంస్థ(ఎల్‌ఐసీ) బాండ్లు జారీచేసిందని, వాటిలో కొన్ని 2023లో వైసీపీ ప్రభుత్వ హయాంలో మెచ్యూర్ అయినా తల్లిదండ్రులకు నగదు చెల్లించలేదని, తమకు తెలియదని గాలికి వదిలేశారని ఆదిరెడ్డి వాసు గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాబట్టి ఆ కుటుంబాలకు ఎల్‌ఐసీ ద్వారా నగదు అందేలా కృషి చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో ఈ బాండ్లు కలిగి ఉన్నవారిలో ఒక బాలిక ఉన్నవారి సంఖ్య 3,079, ఇద్దరు బాలికలు ఉన్నవారి సంఖ్య 20,947గా ఉందన్నారు. దీనిపై మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమాధానం ఇస్తూ 2005కు ముందు చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బాలికలు పాఠశాలకు వెళ్లేలా ప్రోత్సహించేందుకు స్కూల్‌లో చేరిన ఆడపిల్లలకు వెంటనే రూ.500 ఇచ్చేవారని, వారికి 18 ఏళ్లు నిండి ఇంటర్మీడియేట్ పూర్తిచేశాక ఆ కుటుంబానికి రూ.20 వేలు అందించాలనే సదుద్దేశంతో పథకం పెట్టారన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వం దాన్ని మార్చి బాలికాసంరక్షణ పథకంగా మార్చి బాండ్లను జారీచేసిందని, రాష్ట్ర విభజన జరిగినా ఈ పథకానికి మాత్రం విభజన జరగలేదని, ప్రస్తుతం విభజన ఆంధ్రప్రదేశ్‌లో వివిధ జిల్లాల వారీగా 4,39,943 మంది ఉన్నారని వివరించారు. నగదు మొత్తం హైదరాబాద్ ఎల్‌ఐసీలో ఉందని, కూటమి ప్రభుత్వం రాగానే అధికారులు నాలుగైదుసార్లు వారితో చర్చించారని, త్వరలో సీఎం చొరవతో మెచ్యూర్ అయిన బాండ్ల నగదు లబ్దిదారులకు అందేలా కృషిచేస్తామని ఆమె చెప్పారు.

గేదెలకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు : మంత్రి అచ్చెన్న

కొవ్వూరు, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో మృతి చెందిన పాడిగేదెల యజమానులను ఆదుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు శాసనమండలిలో తెలిపారు. శాసనమండలి స్పీకర్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ తాళ్లపూడి మండలంలో గేదెలు అంతుచిక్కని వ్యాధిసోకి మృతి చెందుతుండగా, అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సభ దృష్టికి తీసుకువచ్చారని, మృతి చెందిన గేదెల రైతులను ఆదుకోవాలని మోషేన్ కోరారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గేదెలు మృతి విషయమై చర్యలు తీసుకున్నామని, రైతులకు ఇన్సూరెన్సు పథకం తీసుకువస్తామని, ఈలోపు ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, గత ఐదేళ్ల పెండింగ్ కేసులతోపాటు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 14 నెలల్లో జరిగిన కేసులన్నింటికీ రూ.108 కోట్ల నష్టపరిహారం ఇచ్చామన్నారు. పెద్దేవంలో ఎన్ని పశువులు చనిపోయాయనే నివేదిక తెప్పించి ప్రభుత్వ సహాయానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో డీఎస్సీ విజేతల సరదా కబుర్లు

సంతోషంగా చలో..

డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు నేడు విజయవాడకు పయనం.. రాజమహేంద్రవరం నుంచి ఏర్పాట్లు

9



డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : అడిషనల్ ఎస్పీ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో నమో యువ రన్ పేరుతో డ్రగ్స్ రహిత దేశం ధ్యేయంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక, యువమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేతిరెడ్డి ఆదిత్య, రాష్ట్ర కార్యదర్శి కందుకూరి మనోజ్‌బాబు, నాయీబ్రాహ్మణ సంఘం రూరల్ అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం, వీరా వీరాంజనేయులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి... అభయరూపిణి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణల్లో అభయమిచ్చారు. అన్నపూర్ణా దేవి అవతారంలో దర్శనమిచ్చిన జగన్మాతను భక్తులు దర్శించుకుని పునీతులయ్యారు. భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ అంటూ అమ్మవారిని స్తుతించారు.


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో అన్నపూర్ణాదేవిగా మాణిక్యాంబ అమ్మవారు


కాకినాడ జిల్లా అన్నవరంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన వనదుర్గమ్మ



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జాంపేట గాంధీబొమ్మ సెంటర్లో కనకదుర్గ అమ్మవారికి (పైన), దేవీచౌక్ సెంటర్లో బాలాత్రిపురసుందరి అమ్మవారికి (కింద) సాయంకాల హారతి ఇస్తున్న అర్చకులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో అన్నపూర్ణాదేవిగా వాసవికన్యకాపరమేశ్వరి


కాకినాడ జిల్లా పిఠాపురంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో రాజరాజేశ్వరీదేవి


కాకినాడ జిల్లా సామర్లకోటలో గాయత్రీదేవిగా బాలాత్రిపురసుందరీదేవి


కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో చంద్రఘంటాదేవిగా అపర్ణాదేవి అమ్మవారు


కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరంలో కనకదుర్గ అమ్మవారిని కూరగాయలతో అన్నపూర్ణాదేవిగా అలంకరించిన దృశ్యం


తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం జువ్వలదొడ్డిలో ఇష్టకామేశ్వరి రూపంలో....


విశేష అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు

ఒకే వస్త్రం... ఒకే మంత్రం... ఒకే దీక్ష

వేలాది మంది మాతృమూర్తులతో మహాశక్తి యాగం

'లలిత' సినిమా పోస్టర్, ఆడియో ఆవిష్కరణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో మహాశక్తి యాగం బుధవారం మూడో రోజుకి చేరింది. వేలాది మహిళలు ఒకే వస్త్రం... ఒకే మంత్రం... ఒకే దీక్షతో వంద కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొన్నారు. స్వామి పరిపూర్ణానంద సరస్వతి భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ లలితా సహస్రనామం అత్యంత పవిత్రమైనది, శక్తివంతమైనది అన్నారు. అమ్మను ఆవాహన చేసుకుని నిత్యం సుమారు అరగంటసేపు లలితా సహస్రనామం పారాయణ చేస్తే ఆమె ఆశీస్సులు మెండుగా లభిస్తాయన్నారు. అమ్మ శక్తిని సాక్షాత్తూ ఆ పరమాత్ముడే గుర్తించారన్నారు. తొలుత అమ్మవారికి సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, వటుక భైరవ హోమం, సహస్ర రుద్ర మహా రుద్ర హోమం జరిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శకత్వంలో తెరకెక్కనున్న లలిత సినిమా పోస్టర్‌తో పాటు ఆడియోను స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి విశిష్టతను చాటిచెప్పేలా 'లలిత' పేరుతో సినిమాను తెరకెక్కించేందుకు శ్రీపీఠం ఛైర్మన్ సుధీర్‌రాజు ముందుకురాగా, రచన, దర్శకత్వం వహించేందుకు జొన్నవిత్తుల ముందుకు రావడం అభినందనీయమన్నారు. అమ్మవారే అమ్మాయిలా వస్తే ఎలా ఉంటుంది.... ధర్మం, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం తదితర అంశాలపై ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దిన యూనిట్ సభ్యులను అభినందించారు.

కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కొల్లి రామగోపాల్ చౌదరి, సంగీతం: నాగరాజు, పాటలు: నాగరాజు, మణి, కెమెరామెన్: సురేందర్‌రెడ్డి, ఎడిటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


లలిత సినిమా పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు


మేజిక్ డ్రైన్ నిర్మాణ పనులపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్

మేజిక్ డ్రైన్‌ల నిర్మాణంతో

భూగర్భ జలాలు పెంపొందుతాయి

- క్వాలిటీ కంట్రోల్ ముఖ్య అధికారి గోపీచంద్
- ఉపాధి సిబ్బందికి ఒకరోజు శిక్షణ

గోకవరం, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): మేజిక్ డ్రైన్‌ల నిర్మాణంవల్ల భూగర్భ జలాలు పెంపొందడంతోపాటు, గ్రామాలలో పారి శుధ్యం మెరుగుపడుతుందని చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ అన్నారు. మహత్మా గాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకంలో భాగంగా మేజిక్ సోక్ చానల్ (మేజిక్ డ్రైన్) నిర్మాణపు పనులను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రతీ జిల్లాకు నాల్గు గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారు. గోకవరం మండలంలోని అచ్చుతాపురం గ్రామ పంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు ఆధ్వర్యంలో తూర్పు, పశ్చిమ, ఏలూరు, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఉపాధి సిబ్బందికి బుధవారం అచ్చుతాపురం గ్రామంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈశిక్షణా కార్యక్రమానికి చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ ముఖ్యఅతిథిగా హాజరై మేజిక్ డ్రైన్ నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన విధి విధానాలను సిబ్బందికి వివరించారు. అనంతరం గ్రామంలో నిర్మించనున్న మేజిక్ డ్రైన్ నిర్మాణపు పనులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బత్తుల వెంకటరామకృష్ణ, ఏపీడీ రామ్‌ప్రసాద్, ఎంపీడీవో గోవిందు, ఏపీవో అప్పలరాజుతో పాటు ఐదు జిల్లాల ఇం జనీరింగ్ అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు, పాల్గొన్నారు.

అలరించిన విఘ్నేశ్ ఈశ్వర్ గాత్ర కచేరీ



కచేరీ చేస్తున్న విఘ్నేశ్ ఈశ్వర్

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సరస్వతి గానసభ 122వ దసరా సంగీత, నృత్య, నాటకోత్సవాలు మంగళవారం మూడో రోజుకు చేరుకున్నాయి. నగరంలోని సూర్యకళా మందిరంలో విఘ్నేశ్ ఈశ్వర్ గాత్ర కచేరీ అలరించింది. శ్రీరాగంలో త్యాగరాజస్వామి పంచరత్న కీర్తన ఎందరో మహానుభావులతో ప్రారంభించి... బేగడ రాగంలో శంకరి నీవే మొదలైన కృతులు గానం చేశారు. ఈశ్వర్‌కు గాయత్రి శివాని (చెన్నై) వయోలిన్‌పై, ప్రవీణ్ స్పార (చెన్నై) మృదంగంపై, సరస్వతుల హనుమంతరావు (బోడపాడు) ఘటంపై చక్కటి వాద్య సహకారం అందించారు. సరస్వతి గానసభ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో సంగీతప్రియులు కచేరీని తిలకించి ఆనందించారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాలి

- నన్నయ వీసీ ప్రసన్నశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వేదిక కావాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ కోరారు. క్రీడాకారులకు అవసరమైన వసతులు, వనరులు సమకూర్చి ప్రతిభను ప్రోత్సహించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో బుధవారం క్రీడాబోర్డు సమావేశం జరిగింది. దీనికి వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అఖిలభారత దేహదారుఢ్య ఛాంపియన్‌షిప్‌ను నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని అన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ అనుబంధ కళాశాలల్లో ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలలోని క్రీడాకారుల ప్రతిభకు నన్నయ విశ్వవిద్యాలయం వేదిక కావాలన్నారు. అన్ని కళాశాలల్లో వ్యాయామ విద్య డైరెక్టర్లు ఉండాలని సూచించారు. అకడమిక్ కరిక్యులమ్‌కు ఇబ్బంది లేకుండా క్రీడాపోటీలు నిర్వహించాలని చెప్పారు. నిబంధనలకు అనుగుణంగా ఆయా క్రీడాపోటీల నిర్వహణకు అవసరమై ప్రోత్సాహాన్ని సహకారాన్ని విశ్వవిద్యాలయం అందజేస్తుందని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయం క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. దానిని సద్వినియోగం చేసుకోవాలని యువతను క్రీడలలో రాణించే విధంగా పీడీలు ప్రయత్నించాలని సూచించారు. తరువాత సుమారు 48 రకాల పురుష, మహిళా క్రీడాపోటీలు ఏపి కళాశాలల్లో నిర్వహించాలనే అంశంపై సమావేశంలో చర్చించి నిర్ధారించారు. కేటాయించిన క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహించాలని, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, పీడీలు క్రీడాపోటీలు నిర్వహించిన వెంటనే బిల్లులు సమర్పించాలని రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడాబోర్డు సహాయ కార్యదర్శి ఎం.వి.వి.ఎస్.ఎన్.మూర్తి, కోఆర్డినేటర్ పి.విజయనిర్మల, కె.సుబ్బారావు, పి.ఉమామహేశ్వరీదేవి సి.ఇ ఎస్.లింగారెడ్డి, ఆంధ్రా యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్ సైన్స్ ఎన్.విజయమోహన్, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బీపీఎస్ ఛైర్మన్ జి.సరాహసరోజిని, సాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్, ఫిజికల్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని సందర్శించిన

బోర్డ్ ఆఫ్ విజిటర్స్ బృందం


భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ కీర్తి


సెంట్రల్ జైలులోని హాస్పటల్ వద్ద బోర్డ్ ఆఫ్ విజిటర్స్ బృందం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బోర్డ్ ఆఫ్ విజిటర్స్ బృందం బుధవారం సెంట్రల్ జైలును సందర్శించింది. ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, పరిశుభ్రత, భద్రత, వైద్య సౌకర్యాలు, ఉపాధి కల్పన పరిశ్రమలు, నైపుణ్యశిక్షణ, వంటశాల, బారక్‌లను పరిశీలించింది. వివిధ అంశాలపై జైలు అధికారులతో బృందం సభ్యులు చర్చించారు. ఖైదీలు విడుదల తర్వాత సమాజంలో తిరిగి సమర్థవంతమైన పౌరులుగా మారడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖైదీలు విడుదలైన తర్వాత ఉపాధికి ఇబ్బంది కలుగకుండా ఉండడానికి ఉపాధికల్పన కోర్సులను అందిస్తున్నామని బృందానికి జైలు సూపరింటెండెంట్ రాహుల్ వివరించారు. నైపుణ్య శిక్షణ కూడా ఇస్తున్నా మని చెప్పారు. విద్య, మెరుగైన ఆరోగ్య సేవలను అందిస్తున్నామన్నారు. న్యాయ విజ్ఞానం, న్యాయ సహాయం వంటి వాటిపై మరింత అవగాహన కల్పిస్తామని చెప్పారు. బృందంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ కీర్తి చేకూరి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎస్పీ నరసింహ కిషోర్, జిల్లా ఉపాధి కల్పనా అధికారి హరిశ్చంద్రప్రసాద్, పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్, వ్యవసాయ అధికారి మాధవరావు ఉన్నారు.

పీస్ ఐకాన్ అవార్డుల ప్రదానం

జేఎన్టీయూకే, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్లోబల్ పీస్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీస్ ఐకాన్ అవార్డులను జేఎన్టీయూకేలోని వీసీ చాంబర్‌లో ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ బుధవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.రాజా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గీసాల శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, ఐజక్ న్యూటన్, నరేష్‌బాబు, శివ, బెన్నబాబు, టి.సూర్యారావులకు అవార్డులను అందజేశారు.


వీసీ ప్రసాద్‌తో పీస్ ఐకాన్ అవార్డులు అందుకున్న ప్రముఖులు

ఆర్టీసీలో అప్రంటిస్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో అప్రంటిస్ షిప్ కోసం ఐటీఐ పాస్ అయిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఈనెల 25నుంచి అక్టోబరు 12వ తేదీలోపు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడుల్లో అప్రంటీస్‌షిప్ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు వెరిఫికేషన్ నిమిత్తం తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో అక్టోబరు 14న విజయనగరం వీటీ అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్‌స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్ వద్ద హాజరుకావాలని తెలిపారు. ఎవరికైనా ఎటువంటి సందేహాలుంటే కార్యాలయం పనివేళల్లో ఫోన్ నెం.08922-294906కు ఫోన్ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

నాదస్వరం విద్యాంసుడు

మణికంఠకుమార్‌కు నంది అవార్డు



రాజమహేంద్రవరంసిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరానికి చెందిన నాదస్వరం విద్వాంసుడు తేనంగి మణికంఠకుమార్‌కు నంది పురస్కారం లభించింది. ఈమేరకు బుధవారం రాజమహేంద్రవరంలో అవార్డు గ్రహీత ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ లబ్బీపేటలో దేవదాయధర్మాదయశాఖ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో నంది పురస్కారాన్ని సినీనటుడు శుభలేఖ సుధాకర్, నాదస్వరం విద్వాంసుడు వడ్డాది సత్యనారాయణల చేతుల మీదుగా అందుకున్నారు. ఈమేరకు మణికంఠకుమార్‌ను పలువురు సంగీత అభిమానులు, ప్రముఖులు అభినందించారు.

వచ్చేనెల 25న

రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు

- కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పు గోదావరి జిల్లా శాఖకు నూతన మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు అక్టోబరు 15న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహిస్తామని కలెక్టర్ డా.కీర్తి చేకూరి తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనడానికి జిల్లా రెడ్‌క్రాస్ శాఖలో సభ్యత్వం కలిగిన పేట్రాన్, వైస్ పేట్రాన్, లైఫ్ మెంబర్స్, లైఫ్ అసోసియేట్ మెంబర్స్ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె సూచించారు.

మనస్తాపంతో అన్నవరం దేవస్థానం ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

అన్నవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు పేషీలో సీసీ-2గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి బీఎస్ఎన్ రాజు మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేశాడు. మద్యం తాగి విధులకు హాజరవుతున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, జాగ్రత్తగా నడుచుకోవాలని ఈవో మంగళవారం తన కార్యాలయంలో ఇతర ఉద్యోగుల సమక్షంలో సుతిమెత్తగా హెచ్చరించడంతో అవమానంగా భావించి బాత్‌రూంలు క్లీనింగ్‌కు వినియోగించే హార్పిక్‌ను తాగి రాజు ఆత్మహత్యాయత్నం చేయడంతో హుటాహుటిన కాకినాడ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు తెలిపారు. దేవస్థానం చైర్మన్ రోహిత్ రాజును ఫోన్‌లో పరామర్శించారు. ఈవో సుబ్బారావు రాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు.

బస్సు నుంచి జారి పడి మహిళ మృతి


మరణించిన నర్సమ్మ

అల్లవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బస్సు నుంచి జారి పడి మహిళ మృతి చెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడిలంక వద్ద ఒడలరేవు నుంచి అమలాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు నుంచి నారీగడ నర్సమ్మ(55) బుధవారం ప్రమాదవశాత్తు జారి పడి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించింది. మొగళ్లమూరు శివారు చిరగట్లకు చెందిన నర్సమ్మ మొగళ్లమూరులో బస్సు ఎక్కి జారి పడి మరణించిందని అల్లవరం ఎస్ఐ సంపత్ కూమార్ తెలిపారు. మృతురాలి సోదరుడు చంద్రరావు ఫిర్యాదుతో రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

తాళ్లరేవు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సీతారామపురం గుడ్డివానితూము సెంటర్లో 216 జాతీయ రహదారిపై పెట్రోలు బంకు సెంటర్లో ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైనట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. గాడిమొగ పంచాయతీ పెదవలసలకు చెందిన పాలెపు వీరబాబు, రేకాడి వీరబాబు ద్విచక్రవాహనంపై పెట్రోలు బంకు వద్ద రోడ్డు దాటుతుండగా రాజోలు నుంచి కాకినాడ వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. క్షతగాత్రులకు తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ప్రథమ చికిత్స చేసి అనంతరం అంబులెన్సులో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోనా బోటు దగ్ధం


దగ్ధమవుతున్న బోటు

అల్లవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడల రేవు వైనతేయి నదీ తీరాన కొప్పనాతి భవాని శంకర్‌కు చెదిన సోనా బోటు మంగళవారం అర్ధరాత్రి దగ్ధమైంది. బోటుకు వెల్డింగ్ చేసి వెల్డర్ వెళ్లిపోగా నిప్పురవ్వల కారణంగా దగ్ధమై రూ.15లక్షలు మేర ఆస్తి నష్టం వాటిల్లిందని శంకర్ పేర్కొన్నాడు.

హైవేపై ప్రమాదాల నివారణకు యాంటీ పార్కింగ్ లేజర్ సిస్టం

గండేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు విజయవాడకు చెందిన కెవై సొల్యూషన్స్ ద్వారా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ డెవలప్ చేయించి(యాంటీ పార్కింగ్ లేజర్ సిస్టం) ఏర్పాటు చేస్తున్నట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్ళూరు పరిధిలో ట్రయల్ రన్ చేశామన్నారు. ఈ పద్ధతి ద్వారా జాతీయ రహదారిపై వాహనాలు నిలుపుదల చేస్తే వెంటనే ఐదుగురు పోలీసు అధికారులకి సైరన్, ఎస్ఎంఎస్, ఫోన్ ద్వారా అలర్ట్ చేయడం జరుగుతుందన్నారు. జాతీయ రహదారిపై వాహనం తీసే వరకు సైరన్ మోగుతూనే ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేకశ్రద్ధ పెట్టి దీన్ని ఏర్పాటు చేస్తున్నారని సీఐ పేర్కొన్నారు.

శాంతించిన మత్స్యకారులు

- ఉప్పాడలో ఆందోళన విరమణ
- వచ్చే నెల 10లోగా డిప్యూటీ సీఎం పవన్ ఉప్పాడ వస్తారని డీసీసీబీ చైర్మన్ హామీ
- రాకపోతే మళ్లీ ఆందోళన చేస్తామన్న మత్స్యకారులు


ఉప్పాడలో మత్స్యకారులతో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా కలెక్టర్


కలెక్టర్ ఎదుట నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

కొత్తపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల వల్ల మత్స్య సంపద అంతరించిపోవడంతో తమ జీవనోపాధికి ఆటంకం కలుగుతుందని, నష్టపరిహారం చెల్లించాలని కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్లో మత్స్యకారులు చేపట్టిన ఆందోళనను బుధవారం సాయంత్రం తాత్కాలికంగా విరమించారు. డిప్యూటీ సీఎంతో అక్టోబరు 2నుంచి 10లోగా ఉప్పాడలో మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని డీసీసీబీ చైర్మన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామ స్వామి ఇచ్చిన హామీ మేరకు తాత్కాలికంగా ఆందోళన విరమించామని మత్స్యకార నాయకులు సూరాడ రాజు, ఉమ్మిడి జాన్, నక్కా మణిం కంఠ తెలిపారు. తుమ్మల, జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. వచ్చేనెల 10లోగా డిప్యూటీ సీఎం పవన్ ఉప్పాడ రాకపోతే మళ్లీ ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

కలెక్టర్ వద్దకు గుంపులుగా...

ఇదిలా ఉండగా బుధవారం ఉదయం డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మత్స్యకారుల ఆందోళన దగ్గరకు వచ్చారు. డిప్యూటీ సీఎం పేర్కొన్న పాయింట్లను కలెక్టర్ మత్స్య కారుల వద్ద ప్రస్తావించి, వేటకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సహనం కోల్పోయిన మత్స్యకారులతో పాటు మహిళలు మీరు తెలియజేసిన వివరాలను హామీలను నేరుగా పవన్‌కల్యాణే ఉప్పాడ వచ్చి తమకు స్పష్టమైనహామీ ఇచ్చే వరకు ఎన్నిరోజులైనా రోడ్డుమీదే పడి ఉంటామని కలెక్టర్‌కు తెలిపారు. ఒకానొకదశలో మత్స్యకార మహిళలు ఆందోళన చేస్తున్న ప్రాంతం నుంచి కలెక్టర్ వద్దకు గుంపులుగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పరిస్థితిని గమనించిన అడిషనల్ ఎస్పీ, కాకినాడ డీఎస్పీ మణీష్ దేవరాజ్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ జి.వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు కలెక్టర్‌ను ఆందోళనచేసే ప్రాంతం నుంచి బయటకు తీసుకెళ్లారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తా

అసెంబ్లీ సమావేశాలు ముగిశాక ఉప్పాడ వస్తా : డిప్యూటీ సీఎం పవన్

కొత్తపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలన్నీ తన దృష్టిలో ఉన్నాయని, వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులు, మత్స్యకారప్రతినిధులు, స్థానిక నాయకులతో కమిటీ ఏర్పాటు చేస్తామని పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. కాలుష్య పరిశ్రమల వల్ల మత్స్యకారుల జీవనోపాధికి నష్టంవాటిల్లుతుందని 2 రోజులుగా చేస్తున్న ఆందోళనపై ఆయన స్పందించి బుధవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. తీరప్రాంతాల్లో నెలకొల్పిన ఫార్మా పరిశ్రమల ప్రభావం వల్ల మత్స్యకారుల జీవనోపాధిపై ఏర్పడుతున్న ప్రభావం, ఉప్పాడ మత్స్యకారులు వ్యక్తపరిచిన ఆందోళనలు, సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల కారణంగా మత్స్యకార కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోగలనన్నారు. ప్రస్తుతం శాసనసభ సమావేశాల కారణంగా వ్యక్తిగతంగా వచ్చి మత్స్యకారులతో చర్చించలేకపోతున్నాను. సమస్యల పరిష్కారానికి గత 2 రోజుల నుంచీ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో చర్చిస్తున్నానన్నారు. మత్స్యకారులు ప్రస్తావించిన ప్రతీ సమస్యను పరిగణనలోకి తీసుకుని పరిష్కార మార్గాలు అన్వేషించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఫిషరీస్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాకినాడ జిల్లా కలెక్టర్‌తో కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కమిటీల్లో మత్స్యకార ప్రతినిధులు, స్థానిక నాయకులకు స్థానం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సమస్యల పరిష్కారంతో పాటు జీవనోపాధి మెరుగుదల, తీరప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపైన ఈ కమిటీ దృష్టి పెడుతుందన్నారు. నష్టపరిహారం మదింపుపై ఈ కమిటీ చర్చిస్తుందని, ఆయా నివేదిక ఆధారంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొంటుందని పవన్ పేర్కొన్నారు. ఇప్పటికే వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన సమస్యలను గుర్తించామన్నారు. మరణించిన 18 మంది మత్స్యకారులకు సంబంధించిన కుటుంబాలకు చెల్లించాల్సిన బీమా మొత్తం చెల్లింపు, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ దగ్గర దెబ్బతిన్న పడవలకు నష్టపరిహారం చెల్లింపు అంశాలపై అధికారులతో చర్చించినట్టు తెలిపారు. దానిపై తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. మచిలీపట్నం, అంతర్వేది తదితర ప్రాంతాల్లో మత్స్యకారులకు వేటకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేసినట్టు తెలిపారు. ఆ అంశాలపై కమిటీ నివేదిక కోసం ఎదురు చూడకకుండా ప్రాధాన్యంతో పరిష్కరించాలని తెలిపానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కష్టజీవులకు భరోసా కల్పిస్తుందన్నారు. ఈ క్రమంలోనే ఉప్పాడ మత్స్యకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత స్వయంగా ఉప్పాడ వచ్చి మత్స్యకారులతో కూర్చోని అన్ని సమస్యలను సమగ్రంగా చర్చిస్తానని పవన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గంజాయితో ఐదుగురి అరెస్ట్

రూ.45 లక్షల విలువైన 900 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయితో పట్టుబడ్డ నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అడ్డతీగల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాకు పాల్పడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.45 లక్షల విలువైన 900 కిలోల గంజాయిని రాజవొమ్మంగి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా జరుగుతుందని సమాచారం అందడంతో అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ భర్దర్ ఆదేశాల మేరకు రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి సీఐ ఎస్.గౌరిశంకర్ పర్యవేక్షణలో ఎస్ఐ డి.వెంకటేష్, సిబ్బంది మంగళవారం గంగవరం శివారు నెమల్లి చెట్టు సెంటర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఎండపల్లి వైపు నుంచి వస్తున్న స్కార్పియో, మోటార్‌సైకిల్, మినీవ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా పట్టుకుని వాహనాలను తనిఖీ చేయగా ఆశోక్‌లీల్యాండ్ బడాదోస్త్ వాహనంలో 900 కిలోల గంజాయి పట్టుపడినట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. గంజాయి విలువ రూ.45 లక్షలు ఉంటుందన్నారు. ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కామ్‌వాడ గ్రామానికి చెందిన పరేష్ బిస్వాస్, న్యూటెక్‌పడార్ రాలేగడా గ్రామానికి చెందిన రబీంద్ర కరా, కమ్‌వాడా గ్రామానికి చెందిన సకాంత్‌రే, ఏఎస్ఆర్ జిల్లా దారకొండ గ్రామానికి చెందిన ముర్ల లక్ష్మణరావు, తూర్పు గోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన నక్కా శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వారి నుంచి మహీంద్రా స్కార్పియో, ఆశోక్‌లీల్యాండ్ బడాదోస్త్, ఎవేంజర్ బజాజ్ మోటారుసైకిల్, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు గ్రూపుగా ఏర్పడి ఒరిస్సా రాష్ట్రంలోని మల్కన్‌గిరి, చిత్ర కొంద డివిజన్ పరిసర గ్రామాల్లో గంజాయికొని రాజమహేంద్రవరం, విజయవాడ, చెన్నై, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుపడినట్టు ఎస్ఐ తెలిపారు. పరేష్ బిస్వాస్‌పై ఇప్పటికే 2 ఎన్‌డీపీయస్ కేసులు ఉన్నాయని, గతంలో 920 కిలోల గంజాయి రవాణాలో కేసులో పరారీలో ఉన్నట్టు చెప్పారు. దాడుల్లో ఏఎస్ఐ సీహెచ్ వివి మహర్షి, హెడ్‌కానిస్టేబుల్ కె.రాంబాబు, పోలీసులు సీహెచ్.ఆశోక్, కెసాయినాద్, సీహెచ్ వీరబాబు, కొండబాబులు ఉన్నారు. నిందితులను పట్టుకున్నవారిని ఎస్పీ అభినందించారు.

దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల మధ్య కొట్లాట


విద్యార్థి తల, చెవి భాగంలో గాయాలు

పెద్దాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం కళాశాల బయట కొట్లాటకు దిగారు. సీనియర్, జూనియర్స్ మధ్య ఘర్షణ జరిగింది. కళాశాలలో విద్యార్థుల మధ్య లోకల్, నాన్ లోకల్ ప్రస్తావన రావడంతో ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ విషయాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడంతో గొడవ మరింత పెద్దదయింది. ఈ ఘటనలో ఫైనల్ ఇయర్ విద్యార్థి షేక్ సుభానిపై జూనియర్స్ కొంతమంది బయట వ్యక్తులతో కలిసి బీర్ బాటిల్‌తో దాడి చేశారు. దీంతో సుభాని తలపై గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు ఎస్ఐ మౌనిక తెలిపారు.

బీరు బాటిల్‌తో దాడి

కొడవలి సర్పంచ్‌కు గాయాలు


గాయపడిన సర్పంచ్

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీరు బాటిల్‌తో దాడి ఘటనలో కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి సర్పంచ్‌కు గాయాలయ్యాయి. కొడవలి సర్పంచ్ బుర్రా రామచంద్ర (గొల్లబాబు) బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉన్నారు. అక్కడకు వచ్చిన గ్రామానికి చెందిన తాటిపర్తి అప్పారావు బీరు బాటిల్‌తో దాడి చేశాడు. దీంతో పలు చోట్ల గాయాలయ్యాయి. సర్పంచ్ ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

విశ్వనాథ వీరంగం!

- ఇంద్రకీలాద్రిపై తలుపులమ్మ ఆలయ ఈవో ఓవరాక్షన్
- కానిస్టేబుల్ పట్ల అవమానకర ప్రవర్తన
- వీఐపీ క్యూ వద్ద ఆపి మెడలో ఉన్న పాస్ తెంపేసిన వైనం


కానిస్టేబుల్ గురువులు మెడలో పాస్‌ను లాగేస్తున్న విశ్వనాథరాజు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

కాకినాడ జిల్లా తలుపులమ్మ దేవస్థానం ఈవో విశ్వనాథరాజు ఇంద్రకీలాద్రిపై వీరంగం చేశారు. దేవస్థానంలో మొత్తం పెత్తనం తనదే అన్నట్టుగా వ్యవహరించారు. వీఐపీ క్యూ మార్గంలో పోలీసు కానిస్టేబుల్ పట్ల దుర్మార్గంగా ప్రవర్తించారు. ఆయనను భక్తులు, తోటి ఉద్యోగుల ముందు అవమానపరిచేలా నడుచుకున్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ గురువులు ఇంద్రకీలాద్రిపై ఇంతకుముందు పోలీసు శాఖ తరఫున ప్రొటోకాల్ వ్యవహారాలు చూసేవారు. ఆయన శరన్నవరాత్రుల ఆరంభం నుంచి విధుల్లో ఉన్నారు. దీనికి సంబంధించి అధికారులు గురువులుకు డ్యూటీ పాస్‌ను జారీ చేశారు. విధి నిర్వహణలో భాగంగా గురువులు వీఐపీ క్యూ వద్ద నుంచి రాజగోపురం వైపునకు వెళ్తున్నారు. అక్కడే ఉన్న విశ్వనాథరాజు ఆయనను క్యూలైన్ వద్ద ఉన్న గేటు దగ్గర ఆపారు. తాను పోలీసు కానిస్టేబుల్‌నని గురువులు చెప్పారు. మెడలో వేసుకున్న డ్యూటీపాస్‌ను విశ్వనాథ రాజుకు చూపించారు. పాస్‌ను చేతితో పట్టుకుని అందులో ఉన్న ఫొటోను చూపిస్తూ ఇది నువ్వా... ఇది నువ్వా అంటూ రెట్టించి దురుసుగా మాట్లాడారు. మెడలో ఉన్న పాస్‌ను తెంచేశారు. దీనితో గురువులు జేబులో ఉన్న పోలీసు శాఖ గుర్తింపుకార్డును చూపించారు. దాన్ని చూసి చిత్కారంగా విశ్వనాథరాజు మాట్లాడారు. ఎలాంటి తప్పు లేకపోయినా గురువులపై విశ్వనాథ రాజు వీరంగం చేస్తుండడంతో చుట్టుపక్కల ఉన్న అధికారులు, మీడియా ప్రతినిధులు ఆయనను నిలదీశారు. ఇదేం పద్ధతిఅని ప్రశ్నిస్తుండగా సమాధానం చెప్పకుండా విశ్వనాథరాజు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఒక దేవస్థానానికి ఈవో హోదాలో ఉన్న అధికారి ఇలా ప్రవర్తించడంపై క్యూల్లో ఉన్న భక్తులు విస్తుపోయారు. ఈవో ప్రవర్తనకు గురువులు చాలా ఇబ్బందిపడ్డారు.

సంతోషంగా చలో..

- డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు విజయవాడకు పయనం
- రాజమహేంద్రవరంలో ఏర్పాట్లు



సత్యసాయి గురుకులంలో మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ..


టీవీఎం హైస్కూల్లో ఆనందం వ్యక్తం చేస్తూ..

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల విజయవాడ ప్రయాణానికి ఏర్పాట్లు పూర్తి చేశామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డా.కీర్తి చేకూరి తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న నియామక పత్రాల జారీ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి ఉపాధ్యాయ అభ్యర్థి, ఒక సహాయకుడు/సహాయకురాలితో బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరంలో ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బస కేంద్రాల వద్ద రిజిస్ట్రేషనుకు హాజరుకావడం జరిగిందన్నారు. రాత్రి వసతి, భోజనం, గురువారం ఉదయం టిఫిన్ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి బస్సుకు ఒక పర్యవేక్షకుడిని నియమించామన్నారు. అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా జిల్లా నోడల్ అధికారులు శ్రద్ధ తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఆయా పాఠశాలలను కలెక్టర్ సందర్శించి వసతి ఏర్పాట్లను పరిశీలించారు. ఉపాధ్యాయ అభ్యర్థులతో ముచ్చటించారు.


లాలాచెరువు హైస్కూల్ విశ్రాంతి గదిలో అభ్యర్థులు



కొత్త టీచర్లతో ముచ్చటిస్తున్న తూర్పుగోదావరి కలెక్టర్ కీర్తి, సత్యసాయి గురుకులంలో మహిళా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ప్రత్తిపాడు నగల దుకాణంలో చోరీ

షట్టర్ పగల కొట్టి 11 కిలోల వెండి ఆభరణాలు అపహరణ


ప్రత్తిపాడులో చోరీ జరిగిన నగల దుకాణం


దుకాణంలో క్లూస్ టీం తనిఖీలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని ఒక నగల దుకాణంలో దుండగలు 11కిలోల వెండి వస్తువులు చోరీ చేశారు. బుధవారం వేకువజామున 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజుసెంటర్ సమీపంలో టీడీపీ నాయకుడు గొంతిన సురేష్‌కు చెందిన సురేష్‌జ్యూయలర్స్ అండ్ బ్యాంకర్స్ దుకాణంలో చోరీ జరిగింది. సీసీ కెమెరాలలో బుధవారం వేకువ జామున 2గంటలు తరువాత నలుగురు దుండగులు షాపులోకి చొరబడగా మరో ఇద్దరు ముసుగులు ధరించి షాపునకు కొంచెందూరంలో కాపలాగ ఉన్నారు. షట్టర్ పగల కొట్టి నగల దుకాణంలో ఉన్న రూ.2లక్షలు విలువ చేసే 11కిలోల వెండి ఆభరణాలు దోచుకుఉన్నారు. దుకాణంలోని లా కర్‌ను తెరిచేందుకు దుండగలు విశ్వప్రయత్నాలు చేశారు. కానీ తెరుచుకోకపోవడంతో దొరికిన వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ వ్యవహారం అంతా సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి తరలివచ్చి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ఐ లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీడీఏలకు పునరుజ్జీవం కల్పించండి

అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన రంప ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సర్వతోముఖాభివృద్ధి కోసం నడిచే ఐటీడీఏలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, వాటికి పునరుజ్జీవం కల్పించి గిరిజనాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అసెంబ్లీలో జీరో అవర్ ప్రశ్నోత్తరాల సమయంలో ఐటీడీఏల పనితీరుపై ఆమె మాట్లాడారు. సొసైటీల చట్టం ప్రకారం ఏర్పాటైన ఐటీడీఏల్లో నిబంధనల ప్రకారం నాలుగేళ్లుగా సమావేశాలు జరగని దుస్థితి నెలకొందని, ఇక్కడ ఏం జరుగుతోందో కూడా తెలయని పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సాధారణ సమావేశం, ఏటా వార్షిక సమావేశాలను నిర్వహించాల్సి ఉండగా రంపచోడవరం ఐటీడీఏలో నాలు గేళ్లుగా సమావేశాలే లేవని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత జిల్లాల పునర్విభజన కారణంగా రంపచోడవరం, చింతూరు, పాడేరు, సీతంపేట, పార్వతీపురం, కె.ఆర్.పురం ఐటీడీఏలకు చైర్మన్‌లు ఎవరో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. జిల్లాల పునర్విభజన మేరకు కొత్త జిల్లాల కలెక్టర్లను చైర్మన్లుగా చేస్తూ ఎటువంటి సవరణలను ఇటు ఐటీడీఏలు కానీ, అటు ప్రభుత్వం కానీ చర్యలు చేపట్టలేదన్నారు. ముఖ్యంగా ఐటీడీఏల్లోని అధికారులు, సిబ్బంది ఏళ్ల తరబడి పాతుకుపోయారని ఆమె తెలిపారు. ఐటీడీఏల్లో గత ఆరు సంవత్సరాలుగా నిర్వహించిన ఆడిట్ రిపోర్టులను అందచేయాలని కోరారు. ముఖ్యంగా ఐటీడీఏలు సొసైటీల చట్టంప్రకారం ఏర్పాటు అయినప్పటికీ వాటిని ఎప్పటికప్పుడు రెన్యువల్ చేయాల్సిన అంశాన్ని కూడా అధికారులు విస్మరించి ఐటీడీఏలకు చట్టబద్ధత లేకుండా చేస్తున్నారన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని బుధవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కలిశారు. అడ్డతీగల-ఏలేశ్వరం రహదారి, మడేరు వాగుపై ఆనకట్ట నిర్మించాలని, రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని, చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని వినతిపత్రం అందజేశారు.



గోలింగేశ్వరస్వామి ఆలయంలో చండీయాగం

బిక్కవోలు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న చండీయాగం బుధవారం మూడోరోజుకు చేరింది. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్వతి అమ్మవారికి లక్షకుంకుమార్చనలు జరిపారు. జువ్వలదొడ్డిలో వున్న శ్రీరాజరాజేశ్వరిపీఠంలో అమ్మవారు ఇష్టకామేశ్వరిదేవి రూపంలో దర్శనమిచ్చారు.



దివాన్‌చెరువులో కాశీ అన్నపూర్ణాదేవి

నేడు లక్ష కుంకుమార్చన, పడిపూజ.

రంగంపేట(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిశలేరు ఏడీబీ రోడ్డు వద్ద సాయిదుర్గా కాలనీలో ఉన్న విజయదుర్గాదేవి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు మూడోరోజు ఘనంగా నిర్వహించారు. ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీవరకు నిర్వహిస్తామని, ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి అమ్మవారికి శ్రీసూక్త వేదోక్త విదానముగా కుంకుమపూజలు నిర్వహిస్తామని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

ఐఎస్‌టీఎస్‌లో బతుకమ్మ సంబరాలు

రాజానగరం(ఆంధ్రజ్యోతి): మండలంలో తూర్పుగోనగూడెంలోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఫర్ ఉమెన్ (ఐఎస్‌టీ ఎస్)కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో కళాశాల విద్యార్థినులంతా రంగు రంగుల పువ్వులతో రూపొందించిన బతుకమ్మలు అందరినీ అబ్బుర పరిచాయి. కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ అనూష, ప్రిన్సిపాల్ రాజశ్రీ, అద్యాపకులు, విద్యార్థులు విజయదుర్గ, లీసా, జయశ్రీ పాల్గొన్నారు.

కాశీఅన్నపూర్ణాదేవికి కుంకుమ పూజలు

దివాన్‌చెరువు(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలు మూడో రోజైన బుధవారం అమ్మవారికి విశేషకుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయం సముదాయంలోని కాశీఅన్నపూర్ణాదేవి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. 26న సుహాసినీపూజ, 30న దుర్గాష్టమి సందర్భంగా బాలపూజ జరుగుతుందని ఆలయ అర్చకుడు పులగుర్త కిషోర్ తెలిపారు. అలాగే రాంబాబు డాక్టరు గృహ ఆవరణలోని ఆలయంలో కొలువై ఉన్న విశ్వేశ్వరీదేవి అమ్మవారికి విశేషకుంకుమపూజలతోపాటు హారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించు కుని అక్కడ ఏర్పాటుచేసిన బొమ్మలకొలువును ఆశక్తిగా తిలకించారు.



ఐఎస్‌టీఎస్ కళాశాలలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినులు

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు సత్కారం



ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులతో సత్కరిస్తున్న డిపో మేనేజర్ మాధవ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం డిపో ఆవరణలో బుధవారం ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు అభినందన సత్కార సభ నిర్వహించారు. ఆగస్టు నెలలో అత్యధిక ఈపీకే తెచ్చిన నలుగురు కండక్టర్లు, ఇద్దరు డ్రైవర్లు, అత్యధిక కేఎంపీఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లు, ప్రతిభ కనబరచిన గ్యారేజీ సిబ్బంది ఇద్దరికి డిపో మేనేజర్ కె.మాధవ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్(టి) ఎం.అజయ్‌బాబు, ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్.ఎస్.ఎస్.తో సేవా దృక్పథం అలవడుతుంది

దివాన్‌చెరువు, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): జాతీయసేవాపథకం (ఎన్.ఎస్.ఎస్.) ద్వారా విద్యార్థులలో సేవాదృక్పథం, క్రమశిక్షణ,విలువలు, సమాజంపట్ల అవగాహన వంటివి అలవాటు అవుతాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో వెస్ట్‌జోన్ ఎన్.ఎస్.ఎస్. ప్రీరిపబ్లిక్ డేపరేడ్ శిబిరం ఎంపికలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ వివిధ స్థాయిలలో జరిగే ఎంపికలలో విద్యార్థులు ప్రతిభకనబరచి వచ్చేఏడాది జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్రదినోత్సవం వేడుకలలో నన్నయ విశ్వవిద్యాలయం ఔన్నత్యానికి చిహ్నాలుగా నిలవాలని కోరారు. ఎన్.ఎస్.ఎస్.ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ ఈశిబిరంలో ప్రతిభకనబరచిన విద్యార్థులను ప్రీఆర్డీ క్యాంప్‌కు ఎంపిక చేస్తామన్నారు. దానిలో ప్రతిభావంతులైన వారిని ఢిల్లీ క్యాంప్‌కు ఎంపిక చేస్తామన్నారు. వివిధ అంశాలపై పట్టును పరిశీలించడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, ఎన్.ఎస్.ఎస్. కార్యాలయ సూపరింటెండెంట్ సంజయ్, ఎన్.ఎస్.ఎస్.అధికార్లు, వ్యాయామవిద్య అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్ విజయభాస్కర్‌కు ప్రైడ్ ఆఫ్ ఏపీవోఎస్ అవార్డు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ నేత్రవైద్యుడు పిడుగు విజయభాస్కర్‌కు ప్రతిష్టాత్మక ప్రైడ్ ఆఫ్ ఏపీఓఎస్ (ఆంధ్రప్రదేశ్ ఆప్తొమెటిక్ అసోసియేషన్) అవార్డు లభించింది. ఈ మేరకు బుధవారం రాజమహేంద్రవరంలో ఒకప్రకటన విడుదల చేశారు. 21 సంవత్సరాలలో లక్షా ఇరవైఐదు వేలు పైబడి శుక్లం కంటి ఆపరేషన్ల చేసినందుకుగాను ఆయన సేవలను గుర్తించి గుంటూరులో జరిగిన రాష్ట్ర నేత్రవైద్యుల సదస్సులో రాష్ట్ర కంటి వైద్యుల మండలి ఈఅవార్డునుప్రధానం చేసింది. డాక్టర్ విజయభాస్కర్‌కు రాజమహేంద్రవరంలో వైద్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



అవార్డును అందుకుంటున్న డాక్టర్ పిడుగు విజయభాస్కర్

పశువైద్య సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

అనపర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు చేదోడు వాదోడుగా ఉండే పశు సంపదను కాపాడుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడు కర్రి బులిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పీరా రామచంద్రపురంలో జిల్లా పశుసంవర్ధకశాఖ, ప్రాంతీయ గ్రామీణాబివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మండల పశువైద్యాధికారి టి.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 పశువులకుపైగా గర్భకోశ వ్యాధి చికిత్సలు అందజేసి సుమారు 20వేల విలువైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారి కాంతారావు, ఉప సంచాలకులు వెంకటేశ్వరరావు, ప్రసాద్, కూటమి నాయకులు తాతారెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారు

● 108 రకాల పిండి వంటలతో నైవేద్యం

గోకవరం, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులలో భాగంగా గోకవరంలోని వీరభద్రునిగద్దెలో ఉన్న కనకదుర్గ అమ్మవారు మూడోరోజు బుధవారం అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘ మహిళలు, గ్రామస్థులతో ప్రత్యేక పూజలు నిర్వహించి 108రకాల పిండి వంటలతో అమ్మవారికి నివేదనచేశారు. ధాన్యపు రాశులతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.





శివకు పీస్ ఐకాన్ అవార్డు అందజేస్తున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్

అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి : పీడీ బుజ్జి

బిక్కవోలు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని హౌసింగ్ కార్పొరేషన్ పీడీ నాతి బుజ్జి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఈలు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం మొత్తం మీద 2459 మందికి ఇళ్లు మంజూరు చేయగా 1092 మంది ఇళ్లు నిర్మించుకున్నారని మిగిలిన వారివి వివిధ స్టేజీల్లో నిర్మాణాలున్నాయన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకపోతే అందుకు కారకులైన సిబ్బందిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ముందుగా ఆమె బిక్కవోలు లేఅవుట్‌ను సందర్శించి అక్కడ ఇళ్ల నిర్మాణాల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో నాగేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ పీవీ రామారెడ్డి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



బిక్కవోలు లేఅవుట్‌లో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల వివరాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ బుజ్జి

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

రాజానగరం,(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణశాఖ పీడీ నాతి బుజ్జి ఆదేశించారు. రాజానగరం మండలం మల్లంపూడిలో ప్రభుత్వం సేకరించిన 19.88 ఎకరాల్లో రూపొందించిన లేఅవుట్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. నిర్మాణం పూర్తిచేసిన ఇళ్లతో పాటుగా వివిధ దశల్లో ఉన్న ఇళ్లను పీడీ స్వయంగా పరిశీలించారు. ఈలేవుట్‌లో మొత్తం 295మంది లబ్ధిదారులకుగానూ ఇప్పటివరకు కేవలం 70 మంది మాత్రమే గృహ నిర్మాణాలను పూర్తి చేయగా, 20 మంది పునాది దశ, మరో ఏడుగురు లింటల్‌స్థాయిలో నిర్మాణపనులు చేపట్టారు. 198మంది నిర్మాణ పనులు చేపట్టలేదు. పీడీ వెంట హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ రామారావు, పంచాయతీరాజ్ ఇన్‌చార్జ్ ఏఈ వినయ్‌అనురాగ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ రత్నగిరీష్, వై.వెం కట్రావు, గుప్త ఉన్నారు.

శ్రీరంగపట్నం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

కోరుకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం శ్రీరంగపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రీమెన్ కమిటీ చైర్‌పర్సన్‌గా కోటి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు అడపా వీరబాబు, పర్సన్స్‌గా శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొయిడాల వెంకటరమణ, జనసేన వీర మహిళ దొడ్డి మంగ పెర్సన్స్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అడపా వీరబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, కూటమి నాయకులు సహకారంతో కష్టాల్లో ఉన్న శ్రీరంగపట్నం సొసైటీని లాభాల బాట పట్టించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన నాయకురాలు ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, సొసైటీ నూతన పాలకవర్గాన్ని అభినందించారు. డీసీసీబీ బ్రాంచ్ సిబ్బంది, సీఈవో గణపతి, సర్పంచ్ మద్దాల రమణ, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.



శ్రీరంగపట్నం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా సొసైటీ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న అడపా వీరబాబు, పర్సన్స్‌గా వెంకటరమణ, డి.మంగ

వైసీపీ పాలనలో సొసైటీలను భ్రష్టు పట్టించారు

● రుడా చైర్మన్ బీవీఆర్ చౌది

గత 5సంవత్సరాల వైసీపీ పాలనలో రైతు సహకార సంఘాలను (పీఏసీఎస్) భ్రష్టు పట్టించారని కూటమి ప్రభుత్వం తిరిగి వాటిని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి పేర్కొన్నారు. బుధవారం కోరుకొండ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మండపంలో జరిగిన రైతు సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్డీయే ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. 2024లోఅధిక వర్షాలు, వరదలకు పంట నష్టపోయిన రాజానగరం నియోజకవర్గ రైతులకు రూ.9కోట్లు పంట నష్టం అందించామన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, అన్నదాత సుఖీభవ, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా రైతులను అన్నివిధాలా ఆదుకుంటున్నామన్నారు. శ్రీరంగపట్నం సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అడపా వీరబాబు, పర్సన్స్ కొయిడాల వెంకటరమణ, దొడ్డిమంగ, మిగిలిన రైతాంగం కృషి చేసి సొసైటీని ముందుకు నడిపించాలన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశవరావు, అడపా సుధీర్‌కుమార్, గంగిశెట్టి సత్తిబాబు, డాక్టర్ అడపా శ్రీనివాస్, మద్దాల రమణ తదితరులు మాట్లాడారు. అనంతరం బొడ్డు వెంకటరమణచౌదరిని, అడపా వీరబాబును రైతులు గజమాలతో సత్కరించారు. సర్పంచ్ దూది కాంతారావు, రొంగల శ్రీనివాస్, కర్రి వీర గణేష్, ముద్రు గాంధీ, ఎంపీటీసీ పీతా శ్రీను, కూటమి నాయకులు, కార్యర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా

సత్యగౌరి బాధ్యతల స్వీకరణ



కర్రి సత్యగౌరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మనోజ్

బిక్కవోలు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తూర్పుగోదావరిజిల్లా బిక్కవోలు మండలం తొస్సిపూడి గ్రామానికి చెందిన కర్రి సత్యగౌరి బుధవారం విజయవాడ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారంచేసి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమెను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ అభినందించారు. ఈమె వెంట ఏఎంసీ చైర్మన్ జుత్తుక సూర్యకుమారి, ఆరికరేవుల సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి, కూటమి నేతలు యామాల చిన్నమ్మ, కర్రి శ్రీనివాసరావు ఉన్నారు.

'మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం'

రాజమహేంద్రవరంరూరల్ సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కూటమి నాయకులు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంరూరల్ మండలం కాతేరు గ్రామంలో 4వ సచివాలయం పరిధిలోని అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో సామాజిక శీమంతాలు కార్యక్రమం జరిగింది. 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శీమంతాలు చేశారు. ఈసందర్భంగా గర్భిణులకు సాంప్రదాయ బద్ధంగా శీమంతాలుచేసి పౌష్టికాహారం కిట్లు, పండ్లు అందజేశారు. దీనికి ముఖ్యఅతిథులుగా సీనియర్ నాయకుడు గంగిన హనుమంతరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగిన జాహ్నవి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దా మణి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, ఐసీడీఎస్ సీడీపీవో జి.గౌరమ్మలు హాజరయ్యారు. తొలుత సీడీపీవో గౌరమ్మ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాయల సిబ్బంది, గ్రామ మహిళా సంఘం సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

స్వచ్ఛతహీ సేవలో రోజుకో థీమ్‌తో ముందుకు వెళ్తున్నాం

● అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో రోజుకో థీమ్‌తో ముందుకు వెళుతున్నట్లు నగరపాకల సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. రాజమహేంద్రవరంనగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం తన చాంబర్‌లో అన్నిశాఖల విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో ప్రతిఒక్కరినీ భాగస్వాములు చేయాలని సూచించారు. గురువారం నగరంలో ఘాట్‌ల క్లీనింగ్‌కు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు,సిబ్బంది స్వచ్ఛంద సేవా సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అందువలన ఏక్‌దిన్-ఏక్‌గంట-ఏక్‌సాత్ నినాదంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఎస్ఈ ఇంచార్జి రీటా, ఈఈ మదర్సాఆలీ, మేనేజరు ఎండి అబ్దుల్ మాలిక్, సీఎంఎం రామలక్ష్మి, ఏసీపీ నాగవల్లి పాల్గొన్నారు.

దామిరెడ్డిపల్లిలో వైద్యశిబిరం

కడియం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ఏర్పాటుచేసిన స్వస్థ నారీ, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బలుధవారం కడియపుసావరం, దామిరెడ్డిపల్లి గ్రామాల్లో డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న, డా.ఎం.జెస్సీ సుప్రియల ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు.కార్యక్రమంలో సావరం సర్పంచ్ చెక్కపల్లి మురళికృష్ణ, ఎంపీటీసీ సాపిరెడ్డి వీరదుర్గ, దామిరెడ్డిపల్లి సర్పంచ్ సత్యస్వరూప, ఉపసర్పంచ్ ముద్రగడ జమీ, ఎంపీటీసీ సాయి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట(ఆంధ్రజ్యోతి): భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రంగంపేట మండలంలో ఉన్న రంగంపేట, సింగంపల్లి పీహెచ్‌సీ పరిధిలో గల ఎస్టీరాజాపురం, బాలవరం గ్రామాల్లో వైద్యాధికారులు బి.వేణుశ్రీలక్ష్మీ, కె.చిన్నారావు, బి.జయవర్ధిని ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎస్టీరాజాపురంలో 193 మందికి, బాలవరంలో 213 మందికి మొత్తం 406 మందికి రక్త పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

'పేపరుమిల్లు కాలుష్యం నుంచి

రాజమహేంద్రవరాన్ని రక్షించుకుందాం'

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కాలుష్య కారక పేపర్‌మిల్ నుంచి రాజమహేంద్రవరాన్ని రక్షించుకునేందుకు నగర పౌరులంతా కదిలి రావాలని స్వతంత్ర జనతాపార్టీ అధ్యక్షుడు బర్రే ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక క్వారీ ప్రాంతంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈమేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛమైన నీరు తాగే హక్కు, స్వచ్ఛమైన గాలి పీల్చేహక్కు మనకుందనికాని ఆ హక్కులను కాలరాస్తూ క్యాన్సర్ వంటి రోగాలతో చావాలని నిర్దేశించే విధంగా రాజమహేంద్రవరం నడిబొడ్డున ఉన్న పేపరు మిల్లును తరలించాలని, ఐదు లక్షల మంది ప్రజల ప్రాణాలను సంరక్షించాలని పోరాడుదాం అని అన్నారు. ఈ పోరాటంలో రాజమండ్రి పౌరులు కలిసి రావాలని కోరుతున్నామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాకి శాంతి స్వరూప్, పెంటపాటి రామకృష్ణ, విజయరాజు, ఇజ్జిన రాంబాబు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనితీరు అధ్వానం

కోరుకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):కోరుకొండ మండలంలో గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం పనితీరు అధ్వానంగా ఉందని కనీసం వారు ఏ పని చేస్తున్నారో గ్రామ ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు తెలియడంలేదని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. కోరుకొండ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీఉల్లి సూర్యకుమారి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా వ్యవసాయం, గ్రామీణ మంచినీటి సరఫరాపై సర్పంచ్‌లు నక్కా రాంబాబు, కరణం వెంకటరమణ, కర్రి లక్ష్మీనరోజ,ఎంపీటీసీలు పీతాశ్రీను, రొంగల లక్ష్మమ్మ, అల్లి సింహాచలం, తనకాల నూకరాజు తదితరులు ధ్వజమెత్తారు.

జనసైనికుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



కడియం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రత్నం అయ్యప్ప మిత్రమండలి బుధవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రాజమహేంద్రవరం పలుకు పాఠశాలలో భోజనాలు ఏర్పాటు చేశారు. చిన్నారుల సమక్షంలో పుట్టినరోజు కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా జనసైనికులు మాట్లాడుతూ జనసేన రాష్ట్ర కార్యదర్శి రత్నం అయ్యప్ప పుట్టినరోజు పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాలు చేశామని తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలి : ఆర్డీవో

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఆర్ఎస్ నెం.415లో ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ సమీపంలో జీపీ బండి దారిని ఆర్డీవో కృష్ణనాయక్ పరిశీలించారు. బుధవారం జీపీ బండి దారిని పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఐపీ బండి దారిలో ఆక్రమణల వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. ఆ ప్రాంతంలో అడ్డంగా వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను వెంటనే తొలగించాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా సంబందిత సర్వే నెంబరులో నిర్మించిన అసంపూర్ణ పాకలు, షెడ్లను తొలగించాల్సింది గా సంబంధిత అధికారులకు సూచించారు. ఆ ప్రాంతంలో తాత్కాలికంగా నివాసముంటున్న లబ్ధిదారులకు గతంలో వెలుగుబందలో ఎన్‌పీఐ ద్వారా ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. వారంతా స్వచ్ఛందంగా తాము అక్కడ ఇళ్లను నిర్మించుకుంటామని వెల్లడించారు.

డిమాండ్‌లు అమలు చేయాలని నిరసన

సీతానగరం,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తమ న్యాయపరమైన డిమాండ్‌లు అమలు చేయాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి, నినాదాలు నిరసన తెలిపారు.

శివకు పీస్ ఐకాన్ 2025 అవార్డు

కడియం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ పీస్ డే పురస్కరించుకుని గ్లోబల్ పీస్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్‌టీయూలో చిరుసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, బుర్రిలంక గ్రామానికి చెందిన గెడ్డం శివకు పీస్ ఐకాన్ 2025 అవార్డు అందజేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ చేతుల మీదుగా శివ అవార్డు అందుకున్నారు.

నాగరికత అభివృద్ధిలో

నదులపాత్ర కీలకం

● ఆర్ట్స్ కళాశాలలో ప్రపంచ నదుల దినోత్సవం

రాజమహేంద్రవరంఅర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగరికత అభివృద్ధిలో నదుల పాత్ర ఎంతో కీలకమని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రపంచ నదుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో నదులను తల్లులుగా పూజించారని, అవి మన జీవనాధారం అని స్పష్టం చేశారు. నదులు ప్రాముఖ్యత, నాగరికతల అభివృద్ధిలో వాటిపాత్ర, సంరక్షణ, అవసరంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లెఫ్టినెంట్ ఈసుబ్ భాషా షేక్, కె.అనూష, సుబేదార్ పి.జగదీశన్, 18 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కేడెట్లు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

27న పీడీఎస్‌యూ

రాష్ట్రసభల ఆహ్వాన సంఘం సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ రాష్ట్ర 24వ మహాసభలు నవంబరులో రాజమహేంద్రవరంలో జరుపుకోవాలని రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందని, ఈమేరకు ఈనెల 27వ తేదీన మహాసభల విజయవంతం కోసం ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహిస్తున్నామని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం పక్కనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఉదయం పదిన్నర గంటలకు ఈ సమావేశం జరుగుతుందని, అందరూ ఈ సమావేశానికి హాజరై తమవంతు సహకారం అందించాలని ఆయన కోరారు.

అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన దేవీచౌక్‌లోని బాలాత్రిపుర సుందరీదేవి.. (పక్కన) దేవీచౌక్‌లో కోలాహలం.. కేరళ సంప్రదాయ వాయిద్యాల సందడి →





మూడోరోజు అన్నపూర్ణాదేవిగా సాక్షాత్కారం

కేరళ వాయిద్యాలతో మారుమోగిన దేవీచౌక్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు బాలాత్రిపుర సుందరి అమ్మవారు అన్నపూర్ణాదేశి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేరళ సంప్రదాయ వాయిద్యాలతో దేవీచౌక్ ప్రాంగణం మారుమోగింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు పిల్లలు, పెద్దలు అమ్మవారిని దర్శించుకుని దేవీచౌక్ లైటింగ్‌ను, సెట్టింగ్‌లను తిలకించారు. అలాగే సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. కాగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అమ్మవారిని సాయంత్రం దర్శించుకున్నారు.



మెడిసిన్ తగ్గలే..

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం నేరుగా ప్రజలకు చేరాలన్నదే కేంద్ర ప్రభుత్వ అభిమతం. కానీ ఆ ప్రయోజనం ఇప్పటిదాకా లక్ష్యాన్ని చేరలేదు. మార్కెట్‌లో వేలాది రకాల వస్తువుల ధరలపై జీఎస్టీ తగ్గింపు వర్తించింది. సోమవారం నుంచి రెండు శ్లాబుల జీఎస్టీ అమలులోకి వచ్చింది. దాంతో ఈ విధానంలో ప్రకటించిన వస్తువుల ధరలన్నీ తగ్గిపోవాలి. కానీ ఆ పరిస్థితి ఏవో కొన్ని వస్తువులు మినహా పెద్దగా ఆ ప్రభావం కనిపించలేదు. అంతెందుకు రోజూ కొనుగోలు చేసే కొన్ని కంపెనీల పాల ప్యాకెట్ ధర కూడా ఇప్పటివరకు తగ్గలేదు. ఇక వైద్యానికి సంబంధించి అత్యవసర మందులు, వస్తువులపై కొత్త జీఎస్టీలో తగ్గింపులు ఉన్నాయి. కానీ ఆ తగ్గింపేమీ కనిపించడం లేదు. పాత ఎమ్మార్పీవి అంటూ మెడికల్ షాపుల వారు దోపిడీ చేసేస్తున్నారు.

- జీఎస్టీ తగ్గింపులో మందుల్లో మతలబు
- పాత ఎంఆర్పీలంటూ దోపిడీ
- అత్యవసర మందులపైనా మోసం
- ఉమ్మడి తూర్పులో 3 వేల మెడికల్ షాపులు
- అవగాహన లేమితో రూ.కోట్లలో ప్రజలకు నష్టం
- మూమూళ్ల మత్తులో డ్రగ్స్.. పట్టించుకోని వాణిజ్యం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మందుల ఖర్చు చూసి ఇవాళ రోగం మరింత ముదిరిపోతోంది. ఓవైపు అధిక శాతం డాక్టర్లు మందులతో చీటీలను పూర్తిగా నింపేస్తుంటే.. మరోవైపు మందుల దుకాణాల వాళ్లు ఎడాపెడా దోచేస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో సొంత మెడికల్ షాపులు ఉండడంతో ఇదో అదనపు వ్యాపారంగా మారిపోయింది. బయట షాపుల్లో ఎంఆర్పీపై ఏకంగా 20 శాతం వరకూ తగ్గింపు ఇస్తామంటూ వ్యాపారస్తులు పోటీ పడుతూ ఉంటారు. ఆస్పత్రుల్లోని మెడికల్ షాపుల్లో ఆ రాయితీ వర్తించదు. పైగా మందుల ధర వాస్తవంగా ఎంతో వాటిపై ఉండదు. ఎంఆర్పీ మాత్రమే ఉంటుంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మందులపై జీఎస్టీని గణనీయంగా తగ్గించింది. అత్యవసర మందులపై పన్ను ఎత్తేసింది. కానీ ప్రజలకు మాత్రం ఆ మేరకు జేబుకు ఆదా కనబడడం లేదు. అధిక శాతం దుకాణాల్లో బిల్లులు కూడా ఇవ్వకపోవడంతో జీఎస్టీ తగ్గింపు తెలియడం లేదు.

● ఇలా దోపిడీ...

ఓ వ్యక్తి రాజమహేంద్రవరంలోని హైటెక్ బస్టాండు సమీపంలో ఓ పెద్ద మందుల షాపునకు వెళ్లి 10 ట్యాబ్లెట్ల స్ట్రిప్ కొన్నాడు. దానిపై రూ.335 ఎంఆర్పీ ధర ఉంది. తమ వద్ద ప్రత్యేక రాయితీ అంటూ రూ.284 తీసుకున్నారు. వినియోగదారుడు సంతోషించి.. బిల్లు అడిగాడు. దీంతో రూ.266కి బిల్లు ఇచ్చారు. అదేంటని ప్రశ్నిస్తే జీఎస్టీ తగ్గింపని సెలవిచ్చారు. ఒకవేళ బిల్లు తీసుకోకపోతే నష్టపోయేవాడే కదా. మరో వ్యక్తి హార్లిక్స్ కొన్నాడు. దాని ఎంఆర్పీపై 7శాతం తగ్గించారు. అది తమ షాపులో మాత్రమే ఇచ్చే తగ్గింపని చెప్పాడు. జీఎస్టీ తగ్గింపుపై ప్రశ్నించగా.. ఆ స్టాకు పాత ఎంఆర్పీతో ఉందని జీఎస్టీ తగ్గింపు రాదని సెలవిచ్చాడు. ఇది కేవలం ఆ ఇద్దరికి జరిగిన తంతు మాత్రమే కాదు. నూటికి 99శాతం మందికి మందులపై జీఎస్టీ ఆదా చేకూరడం లేదు. వందల రకాల మందులు ఉండడంతో బోర్డులు పెట్టడం సాధ్యం కాదనుకున్నా.. కనీసం బిల్లులు పక్కాగా ఇస్తూ, వాటిలో జీఎస్టీ తగ్గింపును స్పష్టంగా పేర్కొంటే వినియోగదారుడికి సొమ్ము ఆదా అవుతుంది.

● అంతా అయోమయం

చాలా మందుల షాపుల్లో బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో జీఎస్టీ తగ్గింపు వర్తింపు అయోమయంగా మారింది. బిల్లులు ఇవ్వకపోవడంపై వాణిజ్య పన్నుల శాఖ పట్టించుకున్న దాఖలాలు లేవనే చెప్పవచ్చు. దీంతో తాము కొన్న మందులకు ఇటీవల తగ్గించిన జీఎస్టీ వర్తించిందో లేదో వినియోగదారుడికి తెలియడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3 వేల వరకూ మందుల షాపులుండగా.. 150 వరకూ పెద్ద దుకాణాలు ఉన్నాయి. ఈ పెద్ద దుకాణాల్లో బిల్లులు ఇస్తున్నా జీఎస్టీ తగ్గింపు చూపించడం లేదు. అత్యవసర, క్యాన్సర్ మందులపై జీఎస్టీ గతంలో 5% నుంచి 12% వరకూ ఉండేది. దానిని పూర్తిగా తీసేశారు. జనానికి అత్యవసర మందులపై అవగాహన ఉండదు. వైద్యుడు ఇచ్చిన చీటీ ప్రకారం మందులు తెచ్చుకుంటారు. అత్యవసర మందులతోపాటు సాధారణ మందులను ఒకే చీటీలో రాస్తారు. దీంతో సందట్లో సడేమియా మాదిరిగా అత్యవసర మందులకు జీఎస్టీ తగ్గింపు ఇవ్వడం లేదు. ఉదాహరణకు అత్యవసర మందుల ధర రూ.5 వేలు అనుకొంటే గతంలో రూ.250-600 వరకూ జీఎస్టీ ఉండేది. ఇప్పుడు పూర్తిగా మినహాయించడంతో ఆ మేరకు తగ్గించాల్సి ఉంది. కానీ ఆ లాభం వినియోగదారుడికి అందడం లేదు. గ్లూకోమీటర్, టెస్ట్ స్ట్రిప్‌లు, థర్మామీటర్లు, డయాగ్నస్టిక్ రసాయనాలు/కిట్లు, ఇతర మందులపై జీఎస్టీని 18/12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. కానీ వాటిపై ఆ తగ్గింపును వర్తింపజేయడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని రాజమహేంద్రవరం, కాకినాడ మెడికల్ హబ్‌లుగా కొనసాగుతున్నాయి. దీంతో రోజుకు కోట్లాది రూపాయల మెడిసిన్ ఇతర వైద్య పరికరాలు /వస్తువుల అమ్మకాలు జరుగుతాయి. ఇప్పుడు జీఎస్టీ తగ్గింపు వినియోగదారుడికి చేరకపోవడంతో కేంద్రం ఉద్దేశం నిర్వీర్యమవుతోంది. ఇప్పటికైనా డ్రగ్స్ శాఖ మత్తు వీడితే ప్రజలకు మేలు జరుగుతుంది. వాణిజ్య పన్నుల శాఖ దృష్టి సారిస్తే బిల్లులు మేల్కొంటాయి.

● ఇదో మాయాజాలం

సొంతంగా ఆస్పత్రుల్లోనే మెడికల్ షాపులు ఉండడంతో చాలామంది ప్రిస్క్రిప్షన్ నిండిపోయే వరకూ మందులు రాసేస్తున్నారు. బయట మెడికల్ షాపుల్లో ఇచ్చే రాయితీ కూడా వీళ్లు ఇవ్వడం లేదు. అంటే మందులపై ఎంత లాభం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దీని వెనుక మరో ఆశ్చర్యపోయే మాయ దాగి ఉంది. గతంలో మందుల తయారీ కంపెనీలు రిప్రజెంటేటివ్స్‌ని నియమించుకొని వాళ్లను డాక్టరు వద్దకు పంపించి ప్రొడక్టును ప్రచారం చేసుకోవడం జరిగేది. దీనిని ఎథికల్ మార్కెటింగ్ అనేవాళ్లు. హరియాణా, గుజరాత్‌లోని పలు మూరుమూల ప్రాంతాల్లో మందుల తయారీ కంపెనీలు కోకొల్లలుగా ఉంటాయి. మెడికల్ రిప్రజెంటేటివ్‌లుగా అనుభవం వచ్చిన తర్వాత కొందరు డాక్టర్ల వద్ద ఆర్డర్లు తీసుకొని సొంతంగా ఆ ప్రాంతాలకు వెళ్లి పెద్ద మొత్తంలో మందులు కొనుగోలు చేసి తీసుకురావడం మొదలైంది. దీనిని ప్రాపగాండా కం డిస్ట్రిబ్యూషన్(పీసీడీ) అంటారు. ఇలా మొదలైన ఆ ఒరవడి డాక్టర్లు ఒక బాక్సు కొంటే పది బాక్సులు ఉచితంగా ఇచ్చే స్థాయికి వెళ్లింది. ఇది గమనించిన కొందరు డాక్టర్లు కలిపి నేరుగా రంగంలోకి దిగారు. అలా వాళ్లే సొంతంగా వెళ్లి మందులు తెచ్చుకోవడం మొదలుపెట్టారు. ఉదాహరణకు పెంటాప్రజోల్ షీటు ధర తయారీ కేంద్రం వద్ద రూ.5 ఉంటే మన చేతికి వచ్చేసరికి రూ.150 అవుతుందన్నమాట. వాస్తవానికి కంపెనీ పెట్టిన పేరుకాకుండా ప్రిస్క్రిప్షన్‌లో ఔషధం పేరు రాయాలనే నిబంధనను ఎప్పుడో చంపేశారు. యాంటిబయోటిక్స్ తక్కువగా సూచించాలని నాటితరం వైద్యులు నెత్తీనోరు బాదుకుంటున్నా తమ వ్యాపారం కోసం వైరల్ ఫీవర్‌కి సెఫిక్జిమో ఒఫలాక్సిన్ వంటి యాంటిబయోటిక్స్ చీటీల్లో నింపేస్తున్నారు.



అధ్యక్షా!

బాలికా సంరక్షణ బాండ్లకు నగదు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బాలికా సంరక్షణ పథకం బాండ్లకు నగదు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు. బుధవారం అమరావతిలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆదిరెడ్డి వాసు మాట్లాడారు. బాలికల నిష్పత్తిని ప్రోత్సహించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005లో ప్రభుత్వం కుటుంబంలో ఒక ఆడపిల్ల ఉంటే రూ.లక్ష, ఇద్దరుంటే చెరో రూ.30 వేల చొప్పున రూ.60 వేల జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) బాండ్లు జారీచేసిందని, వాటిలో కొన్ని 2023లో వైసీపీ ప్రభుత్వ హయాంలో మెచ్యూర్ అయినా తల్లిదండ్రులకు నగదు చెల్లించలేదని, తమకు తెలియదని గాలికి వదిలేశారని ఆదిరెడ్డి వాసు గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాబట్టి ఆ కుటుంబాలకు ఎల్ఐసీ ద్వారా నగదు అందేలా కృషి చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో ఈ బాండ్లు కలిగి ఉన్నవారిలో ఒక బాలిక ఉన్నవారి సంఖ్య 3,079, ఇద్దరు బాలికలు ఉన్నవారి సంఖ్య 20,947గా ఉందన్నారు. దీనిపై మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమాధానం ఇస్తూ 2005కు ముందు చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బాలికలు పాఠశాలకు వెళ్లేలా ప్రోత్సహించేందుకు స్కూల్‌లో చేరిన ఆడపిల్లలకు వెంటనే రూ.500 ఇచ్చేవారని, వారికి 18 ఏళ్లు నిండి ఇంటర్మీడియేట్ పూర్తిచేశాక ఆ కుటుంబానికి రూ.20 వేలు అందించాలనే సదుద్దేశంతో పథకం పెట్టారన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వం దాన్ని మార్చి బాలికాసంరక్షణ పథకంగా మార్చి బాండ్లను జారీచేసిందని, రాష్ట్ర విభజన జరిగినా ఈ పథకానికి మాత్రం విభజన జరగలేదని, ప్రస్తుతం విభజన ఆంధ్రప్రదేశ్‌లో వివిధ జిల్లాల వారీగా 4,39,943 మంది ఉన్నారని వివరించారు. నగదు మొత్తం హైదరాబాద్ ఎల్ఐసీలో ఉందని, కూటమి ప్రభుత్వం రాగానే అధికారులు నాలుగైదుసార్లు వారితో చర్చించారని, త్వరలో సీఎం చొరవతో మెచ్యూర్ అయిన బాండ్ల నగదు లబ్ధిదారులకు అందేలా కృషిచేస్తామని ఆమె చెప్పారు.

గేదెలకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు : మంత్రి అచ్చెన్న

కొవ్వూరు, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో మృతి చెందిన పాడిగేదెల యజమానులను ఆదుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు శాసనమండలిలో తెలిపారు. శాసనమండలి స్పీకర్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ తాళ్లపూడి మండలంలో గేదెలు అంతుచిక్కని వ్యాధిసోకి మృతి చెందుతుండగా, అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సభ దృష్టికి తీసుకువచ్చారని, మృతి చెందిన గేదెల రైతులను ఆదుకోవాలని మోషేన్ కోరారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గేదెలు మృతి విషయమై చర్యలు తీసుకున్నామని, రైతులకు ఇన్సూరెన్సు పథకం తీసుకువస్తామని, ఈలోపు ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, గత ఐదేళ్ల పెండింగ్ కేసులతోపాటు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 14 నెలల్లో జరిగిన కేసులన్నింటికీ రూ.108 కోట్ల నష్టపరిహారం ఇచ్చామన్నారు. పెద్దేవంలో ఎన్ని పశువులు చనిపోయాయనే నివేదిక తెప్పించి ప్రభుత్వ సహాయానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జిల్లాలో హోమ్‌స్టేలను ప్రోత్సహించాలి

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఊతమిచ్చేవిధంగా హోమ్ స్టేలను ప్రోత్సహించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం డీఆర్‌డీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో, గోదావరి గట్టు పరిసరాల్లో డ్వాక్రా మహిళలతో చర్చించి హోమ్ స్టేలను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఒకప్పుడు ప్రాచుర్యం పొందిన స్థానిక కళలు, జానపద సంప్రదాయాలను గుర్తించి పుష్కరాల్లో ప్రదర్శనలు, మార్కెటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తే కళాకారులకు స్థిరమైన ఆదాయం, కళలకు పునరుజ్జీవం లభిస్తుందన్నారు. డ్రాన్ దీదీ పథకం కింద వ్యవసాయ అవసరాలకు డ్రోన్లను అందజేసి డ్వాక్రా మహిళలు టెక్నాలజీ ఆధారిత వ్యవసాయ సేవలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 20 సంఘాలకు డ్రోన్లను అందించడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. ఉల్లాస్ ద్వారా 15-59 ఏళ్ల మధ్య వయసు కలిగిన నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మూర్తి, ఏపీడీ సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీఓఎస్ఎస్) ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు పొందడానికి రూ.200 అపరాధ రుసుంతో అక్టోబరు 31 వరకూ గడుపు పొడిగించడం జరిగిందని జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. మరింత సమాచారం కోసం ఏపీవోఎస్ఎస్ వెబ్‌సైటు, ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ లేదా డీఈవో కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.



అనపర్తిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పిచికారి చేసేందుకు డ్రోన్‌లో నింపుతున్న సేంద్రియ ఎరువుల విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కీర్తి

ప్రకృతి వ్యవసాయం ద్వారానే నాణ్యమైన ఆహారం

- రైతులను ఆ దిశగా పోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది
- అనపర్తిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

అనపర్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి ప్రసాదించిన సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా ఆహార ఉత్పత్తుల్లో నాణ్యత లభించి తద్వారా ప్రజలకు నాణ్యమైన ఆహారం అందుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. బుధవారం అనపర్తి మహాలక్ష్మీపేటలో రైతు రాజగిరి శ్రీనివాస్ చేపట్టిన సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతు శ్రీనివాస్‌తో ముచ్చటిస్తూ సేంద్రియ వ్యవసాయానికి మామూలు పద్ధతికి తేడాలు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో వినియోగిస్తున్న సేంద్రియ ఎరువులను వాటిని తయారు చేసుకునే విధానాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. గత మూడేళ్లుగా తాను కౌలుకు చేస్తున్న భూమిలో ఒకటిన్నర ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంభిస్తూ పండిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఏ ఏడాదికాయేడాది ఎక్కువ భూమిలో ప్రకృతి సాగు పెంచుతూ వస్తున్నానని అన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా ఖర్చు తగ్గుతుందని, దిగుబడిలో పెద్ద మార్పు ఉండదని, ఎరువుల ఖర్చులో సగానికి సగం ఆదా అవడమే కాకుండా భూమిలో సారం పెరుగుతుందని ఆయన వివరించారు. ప్రత్యేక పద్ధతిలో రూపొందించిన పనిముట్ల ద్వారా ఊడ్పుల నుంచి కలుపుతీత వరకు వినియోగిస్తున్నామని, ప్రత్యేకంగా తయారుచేసిన జీవామృతాలను డ్రోన్ సహాయంతో పిచికారి చేయడం వల్ల శ్రమతోపాటు సమయం కూడా ఆదా అవుతున్నట్టు ఆయన వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా జరిగే మేలును మిగిలిన రైతులకు తెలిసేవిధంగా అవగాహన కల్పిస్తే ఎక్కువ మంది రైతులు ప్రకృతి సాగుకు మరలే అవకాశం ఉందన్నారు. పచ్చిరొట్ట ద్వారా భూసారం పెరుగుతుందని, తద్వారా యూరియా వాడకం కూడా తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువుల తయారీలో రైతులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. కౌలు రైతులు సేంద్రియ వ్యవసాయం వైపునకు దృష్టి సారిస్తే ఖర్చులు తగ్గడమే కాకుండా కుటుంబానికి ఆర్థికంగాను, ఆరోగ్యంగాను మేలు చేకూరుస్తుందన్నారు. భవిష్యత్‌లో సేంద్రియ వ్యవసాయంతో కూడిన ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందని ప్రజలు వ్యవసాయ క్షేత్రాల వద్దకు వచ్చి కొనుగోలు చేసే పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. అనపర్తి పరిసరాల్లో సుమారు 400 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతోందని ఇది మరింత పెరగాలని ఆమె అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్ మాధవరావు, సర్పంచ్ వారా కుమారి, ఏపీ సీఎంఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, తహశీల్దార్ అనిల్ కుమార్, రైతులు శ్రీనివాస్, చిట్టిబాబు, విశ్వనాథరెడ్డి, ఎమ్‌వీవీ రాఘవరెడ్డి, జిల్లా ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉన్నారు.



రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో డీఎస్సీ విజేతల సరదా కబుర్లు

సంతోషంగా చలో..

డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు నేడు విజయవాడకు పయనం.. రాజమహేంద్రవరం నుంచి ఏర్పాట్లు 10



డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : అడిషనల్ ఎస్పీ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో నమో యువ రన్ పేరుతో డ్రగ్స్ రహిత దేశం ధ్యేయంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక, యువమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేతిరెడ్డి ఆదిత్య, రాష్ట్ర కార్యదర్శి కందుకూరి మనోజ్‌బాబు, నాయీబ్రాహ్మణ సంఘం రూరల్ అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం, వీరా వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఆకుకూరలు, కూరగాయల మొక్కలు పెంచుకోవాలి



మహిళలకు విత్తనాలు అందజేస్తున్న ప్రకృతి, వ్యవసాయశాఖ అధికారులు

దేవరపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటి పెరట్లో ఆకుకూరలు, కూరగాయల మొక్కలు పెంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రకృతి వ్యవసాయశాఖ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. దేవరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం కిచెన్ గార్డెన్‌కు సంబంధించి ఆకుకూర, కూరగాయల విత్తనాలను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎం మాణిక్యం, ప్రకృతి వ్యవసాయ శాఖ యూనిట్ ఇన్‌చార్జి సత్యనారాయణ, సిబ్బంది ప్రసన్న, పద్మావతి, రాధా, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో సచివాలయ ఉద్యోగుల ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సచివాలయ కార్యదర్శులు

కొవ్వూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నల్లరిబ్బర్లు ధరించి నిరసన చేపట్టారు. సంఘం నాయకుడు కే.సుభాకర్ మాట్లాడుతూ ఉద్యోగులను మాతృశాఖలకు పంపించాలని, అలాగే జూనియర్ అసిస్టెంట్ స్కేల్ అమలుచేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు అందించాలని, ప్రభుత్వ సెలవు రోజుల్లో బలవంతపు పనులు నిలుపుదల చేయాలని, సర్వేల పేరుతో వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

'తుమ్మలమ్మ తల్లి ఎగువ, దిగువ గుడికి సంబంధం లేదు'

నల్లజర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం తుమ్మలమ్మ తల్లి ఎగువ, దిగువ గుడి కమిటీలకు సంబంధం లేదని దిగువ గుడి కమిటీ చైర్మన్ తలంశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చీపురుగూడెం గ్రామదేవత తుమ్మలమ్మ తల్లిని ఎగువ గుడి వారు పట్టించుకోకపోవడంతో 2022వ సంవత్సరంలో దిగువ గుడిని తలంశెట్టి కుటుంబీకులు, ఇతర వ్యక్తులు చందాలు వేసుకుని గుడిని కట్టించి గుడికి కమిటీని నియమించామని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వచ్చే ఆదాయంతో అమ్మవారికి దూప దీప నైవేద్యాలు, సంబరాలు, అఖండ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించే వారమని, మిగిలిన రూ. లక్షా 50 వేలు గ్రామానికి చెందిన తలంశెట్టి కోటేశ్వరరావు దగ్గర ఉందని, వాటిని ఇస్తే వంటశాలను నిర్మిస్తామని చెప్పడంతో కోటేశ్వరరావు ఎగువ గుడి వారితో కలిసి రెండు గుళ్ల కలిపి కమిటీ వేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గోపాలపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్యశిబిరాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ మనోహర్ అన్నారు. వాదాలకుంటలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని బుధవారం ఎస్‌ఐ వైద్యపరీక్షలు నిర్వహించుకుని ప్రారంభించారు. సంస్థ మండల అధ్యక్షుడు రాపాక ఫణికిషోర్, చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు శేఖర్, సొసైటీ అధ్యక్షులు వడ్లమూడి రమేశ్, గ్రామ కమిటీ అధ్యక్షులు కాకర్ల శ్రీరామ్, ఎల్లిన భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒకటో వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



చైర్మన్ ఆదినారాయణను అభినందిస్తున్న వార్డు ప్రజలు

నిడదవోలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధిపథంలో నిలపడమే ధ్యేయమని మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని 1వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, మునిసిపల్ ఏఈలు హేమంత్, అవినాష్, జనసేన నాయకులు మద్దిపాటి ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



నిడదవోలు : ప్రత్యేక అలంకరణలో కోట సత్తెమ్మ వారు



పెరవలి : కానూరులో వెలసిన కొండాలమ్మవారు

వివిధ రూపాల్లో అమ్మవార్లు

● మండపాలు, ఆలయాల వద్ద విశేష పూజలు చేసిన మహిళా భక్తులు

కొవ్వూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆరికిరేవులలో వేంచేసియున్న పాశాలమ్మ వారు, రాజరాజేశ్వరి అమ్మవార్లకు బుధవారం గ్రామస్థులు సారె సమర్పించారు. దసరా నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. చావా రామకృష్ణ శ్రీనివాస్ దంపతులు, యనమదల సోమరాజు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులు ప్రతి ఇంటినుంచి చీర సారెలను తీసుకుని మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యుడు యనమదల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ హైందవ సంస్కృతి పరిరక్షణలో భాగంగా గ్రామదేవతలకు చీర, సారెను అందించడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో ఇటువంటి వేడుకలు జరపాలన్నారు. కార్యక్రమంలో పోతుల ఏకోనారాయణ, చావా వెంకట్రావు, చావా రంగారావు, మద్దిపాటి లక్ష్మీ శ్రీనివాస్, గుత్తా వెంకటరమణ, గ్రామస్తులు భవానీ మాలధారులు పాల్గొన్నారు. భవానీదీక్షాదారులకు యనమదల సుబ్రహ్మణ్యం అన్నదానం చేశారు. అలాగే గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో బాలలకు బాలపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. చామర్తి సుబ్రహ్మణ్యం దంపతులు పాల్గొని చండీహోమం జరిపించారు. అలాగే పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద మూడోరోజు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

పెరవలి: దేవీ నవరాత్రుల్లో భాగంగా కానూరులో వేంచేసియున్న కొండాలమ్మ వారికి బుధవారం ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు, సహస్రనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పలువురు భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిడదవోలు: తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ వారి దేవస్థానంలో బుధవారం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. ఉదయం నిత్యాభిషేకం, ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, సాయంకాలం హోమాన్ని నిర్వహించారు. ప్రత్యేక కుంకుమ పూజలో సుమారు 213 మంది దంపతులు పాల్గొన్నారు. పలు జిల్లాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే గ్రామదేవత నంగాలమ్మ తల్లికి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విశేషపూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం భవానీమాలధారులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గోపాలపురం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు కనకదుర్గమ్మ వారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెద్దేవంలో మరో.. రెండు గేదెలు మృత్యువాత

తాళ్లపూడి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దేవంలో బుధవారం మరో రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి చెందిన తోట నాగేశ్వరరావుకు గేదెలకు వ్యాధి సోకాయన్నారు. కాగా చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వారంతా చెబుతున్నారు.

ఎమ్మెల్యే చొరవతో.. బస్సు సర్వీసు ప్రారంభం



అయ్యవరంలో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఉదయభాస్కరరావు

నల్లజర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అయ్యవరం, కొత్తగూడెం గ్రామాలకు నాలుగు సంవత్సరాలుగా ఆర్టీసీ బస్సు సౌకార్యం లేక గ్రామస్థులతోపాటు ద్వార కాతిరుమల వెళ్లే భక్తులు నానా ఇబ్బందులు పడేవారు. కాగా, ఎట్టకేలకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు చొరవతో బుధవారం నుంచి తణుకు డిపోకు చెందిన సర్వీసును తణుకు నుంచి దూబచర్ల, కొత్తగూడెం, అయ్యవరం మీదుగా ద్వారకా తిరుమలకు తిరగనుంది. అయ్యవరం వచ్చిన బస్సును స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కూచిపూడి ఉదయభాస్కరరావు,హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరాసాహెబ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో దూబచర్ల టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాకర్ల రామకృష్ణ, అయ్యవరం గ్రామ అధ్యక్షుడు చుక్క శ్రీను, జనసేన మండల నేత శివకృష్ణ, నాదెళ్ల రాధాకృష్ణ, చింతపల్లి వెంకటేశ్వరరావు, జోగి ఉమాశంకర్, మైనం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆవపాడులో నిప్పుల గుండం తొక్కిన భవానీలు



నిప్పుల గుండం తొక్కేందుకు సిద్ధంగా ఉన్న భవానీలు

నల్లజర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆవపాడులో బుధవారం రాత్రి భవానీ భక్తులు నిప్పులగుండం తొక్కారు. రెండు పీఠాలకు చెందిన సుమారు 70 మంది భవానీలు, 10 మంది పొడి భవానీలు పాల్గొన్నారు. గురు భవానీలు అచ్యుత సుబ్బారావు (ముసలయ్య), మద్దూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వందల సంఖ్యలో భక్తులు, తదితరులు వచ్చి పాల్గొన్నారు.

వేలివెన్నులో కోటి లలితసహస్రనామ పారాయణం



పారాయణంలో పాల్గొన్న మహిళలు, అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా వేలివెన్నులోని అమ్మవారిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులతో కోటి లలితసహస్రనామపారాయణం నిర్వహించారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

నల్లజర్ల నూతన ఎంపీడీవో బాధ్యతలు



నూతన ఎంపీడీవో సత్యనారాయణను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

నల్లజర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండల ఎంపీడీవోగా ఎంవీఎస్ సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జంగారెడ్డిగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయంలో ఏవోగా పనిచేసి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గోపాలపురం ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పనిచేసిన మంగతాయారు ఇప్పటి వరకు నల్లజర్ల ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేశారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవోను సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు.

పేకాట శిబిరంపై దాడి

● అదుపులో ఐదుగురు వ్యక్తులు

నల్లజర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలికిచర్లలో పేకాట శిబిరంపై బుధవారం నల్లజర్ల పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 5,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన నక్కా నాగరాజు (దత్తు), నున్న అచ్చయ్య, నున్న మురళి, ఆచంట రమేష్ మరొకరు కలిసి పేకాటాడుతుండగా గ్రామస్థుల నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు.

గ్రామాల్లో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్



మహిళలకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

నిడదవోలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలోని మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యవంతంగా ఉంటుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ అన్నారు. బుధవారం తిమ్మరాజుపాలెంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తాళ్లూరి ఆండ్రే మాట్లాడుతూ ఆరోగ్యమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తూ మందులను అందజేస్తోందన్నారు. కార్యక్రమలో నాయకులు బండి వెంకటేశ్వరరావు, బళ్ళ నాగబాబు, కొప్పుల వెంకట్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అన్నదేవరపేటలో బుధవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా సచివాలయం-1 పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో డాక్టర్ పీ.స్వర్ణలత, వైద్య సిబ్బంది పాల్గొని మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్నదేవరపేట సొసైటీ డైరెక్టర్ చెవ్వూరు బంగార్రాజు, వెలుగుబంటి బాలకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ కవల రామాంజనేయులు, వెలుగుబంటి శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'యర్నగూడెం రోడ్డుకు మరమ్మతులు చేపడతాం'



రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

దేవరపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యర్నగూడెం - త్యాజంపూడి రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో నిడదవోలు, జంగారెడ్డిగూడెం వెళ్లే ఆర్టీసీ, స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై త్యాజంపూడి గ్రామస్థులు పలుమార్లు ఆందోళన చేపట్టారు. కాగా, ఎట్టకేలకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్పందిస్తూ త్యాజంపూడి రోడ్డులో యుద్ధప్రతిపాదికన ప్రస్తుతం గుంతలు పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం ఆ రోడ్డును వారు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఈఈ రూప్ కుమార్ మాట్లాడుతూ ఈ రోడ్డులో పెద్దపెద్ద గుంతలున్నాయని, ప్రస్తుతం వాటిని పూడ్చటం జరుగుతోందన్నారు. అలాగే యర్నగూడెం నుంచి త్యాజంపూడి వరకు మూడున్నర కిలోమీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.మూడున్నర కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వానికి ప్రపోజల్ పంపించామని చెప్పారు. వర్షాకాలం అనంతరం ఈ రోడ్డు నిర్మాణాలు చేపడతామన్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ బీవీ రమణ ఉన్నారు.

విద్యార్థులకు సేవాభావం అవసరం

● ఏబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.రామ్మోహన్

కొవ్వూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజం పట్ల బాధ్యత, సేవాభావం కలిగి ఉండాలని అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.రామ్మోహన్ అన్నారు. జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆరికిరేవులలో కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామ్మోహన్ సొసైటీ అధ్యక్షుడు చావా శ్రీనివాసరావుకు మొక్కలను అందజేశారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ మట్టా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జీ.విమలాదేవి మాట్లాడుతూ విద్యార్థులు నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత మేమంతా తీసుకుంటామన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి వై.రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డా.వై.రమేష్ జాతీయ సేవా పథకం దినోత్సవం గూర్చి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఇటీవల రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తర్వాత పలు విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లిపూడి వెంకట్రావు, గ్రామస్థులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'మ్యాజిక్ డ్రైన్లతో భూగర్భజలాలు పెరుగుదల'



పనులపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోకవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం వల్ల భూగర్భ జలాలు పెంపొందడంతోపాటు గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపడుతుందని చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మ్యాజిక్ సోక్ చానల్ (మేజిక్ డ్రైన్) నిర్మాణ పనులు చేపట్టేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రతి జిల్లాలో నాలుగు గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారు. మండలంలోని అచ్యుతాపురం పంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. డ్వామా పీడీ ఏ.నాగమహేశ్వరరావు ఆధ్వర్యంలో తూర్పు, పశ్చిమ, ఏలూరు, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఉపాధి సిబ్బందికి బుధవారం అచ్యుతాపురంలో ఒకరోజు శిక్షణ కార్యక్ర మాన్ని నిర్వహించారు. దీనికి చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ ముఖ్యఅతిథిగా హాజరై మేజిక్ డ్రైన్ నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన విధివిధానాల గురించి సిబ్బందికి వివరించారు. అనంతరం గ్రామంలో నిర్మించనున్న మ్యాజిక్ డ్రైన్ నిర్మాణ పనులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల వెంకట రామకృష్ణ, ఏపీడీ రామ్‌ప్రసాద్, ఎంపీడీవో గోవింద్, ఏపీవో అప్పలరాజుతో పాటు ఐదు జిల్లాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా చలో..

●డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు

● విజయవాడకు పయనం ● రాజమహేంద్రవరంలో ఏర్పాట్లు



సత్యసాయి గురుకులంలో మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ..

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ - 2025లో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల విజయవాడ ప్రయాణానికి ఏర్పాట్లు పూర్తి చేశామని తూర్పుగోదావరి కలెక్టర్ డా.కీర్తి చేకూరి తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న నియామక పత్రాల జారీ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి ఉపాధ్యాయ అభ్యర్థి, ఒక సహాయకుడు/సహాయకురాలితో బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరంలో ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బస కేంద్రాల వద్ద రిజిస్ట్రేషనుకు హాజరుకావడం జరిగిందన్నారు. రాత్రి వసతి, భోజనం, గురువారం ఉదయం టిఫిన్ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి బస్సుకు ఒక పర్యవేక్షకుడిని నియమించామ న్నారు. అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా జిల్లా నోడల్ అధికారులు శ్రద్ధ తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఆయా పాఠశాలలను కలెక్టర్ సందర్శించి వసతి ఏర్పాట్లను పరిశీలించారు. ఉపాధ్యాయ అభ్యర్థులతో ముచ్చటించారు.

వెంకన్న ఆలయాభివృద్ధికి రూ.50 వేలు విరాళం

దేవరపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి దేవరపల్లికి చెందిన అనిశెట్టి శ్రీనివాసరావు, ఉమా కుమారి దంపతుల కుమారుడు ప్రసన్నకుమార్ పుట్టినరోజు సందర్భంగా రూ. 50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆ దంపతులను ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు అభినందించారు. ఆలయ కమిటీ సభ్యులు గుడ్ల వెంకటేశ్వరరావు, గేలం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.